బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం, 23 ఆగస్టు-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు



## హెజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో పేలుడు



# నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

- ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది
- ఉప్పల్ బాధితులతో హరీష్ రావు



హైదరాబాద్, ఆగస్టు 21: నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మి గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ం బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో

మిగతా 3లో..

# అక్రమ నిర్మాణానికి బలైన ప్రాణాలు

- పర్మిషన్లు ఒకలా.. నిర్మాణం మరోలా..
- 50 గజాల స్థలంలో ఆరంతస్తుల నిర్మాణం..
- నిబంధనలకు తూట్లు...

భవనం కూలిన వెంటనే పరారైన బిల్డర్..

- పోలీసుల గాలింపు...
- గచ్చిబౌలిలో ఏడంతస్తుల

భవనం నేలమట్టం..

- శిథిలాల కింద ఇద్దరు కార్మికుల మృతి



హైదరాబాద్, ఆగస్టు 22: గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో శనివారం మధ్యాహ్నం ఘోర భవన ప్రమాదం చోటుచేసుకుంది. నాలా పక్కనే కేవలం 50 గజాల స్థలంలో నిర్మించిన ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు నిర్మాణ కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని మృతిచెందారు. సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బంది భారీ యంత్రాలతో శిథిలాలను తొలగించి మృతదేహా లను వెలికితీశారు.పూర్తి వివరాల్లోకెళ్తే.. అంజయ్యనగర్‌లో నిర్మా ణం పూర్తిచేసి అద్దెకు ఇచ్చేందుకు సిద్ధమవుతున్న ఓ భవనం శనివారం

# సచివాలయం ముందు పెద్ద గుంత

- లంకె బిందెల కోసం తవ్వారా అంటూ కెటిఆర్ సెటైర్లు



హైదరాబాద్,ఆగస్ట్22 : హైదరాబాద్‌లోని రోడ్ల దుస్థితికి సం బంధించిన ఓ వీడియో సోషల్‌మీడి యాలో వైరల్‌గా మారింది. ఏకంగా తెలంగాణ సచివాలయం ముందే పెద్ద గుంత తవ్వి అలాగే వదిలేయడంపై ఓ నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ భారీ గుంతను చూపిస్తూ ఎక్స్‌లో చేసిన పోస్టుపై ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ పోస్టుపై స్పందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రేవంత్ సర్కార్‌పై సెటైర్లు వేశారు. సెక్రటేరియట్ ముందే ఇంత పెద్ద గుంత ఉంది. ఎవరైనా సెక్రటేరియట్ చూసు కుంటూ వస్తే ఈ గుంతలో పడి ఛస్తారని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇంతమంది పోలీసులు వెళ్తుంటారు. ఇంత మంది జనాలు వెళ్తుంటారు.. అలా ంటి చోట ఏంటి గుంతనా అని ప్రశ్నించారు. సీఎం గారూ హుస్సేన్ సాగర్‌ను ఇక్కడ కూడా పెట్టాలని అనుకుంటున్నారా? అనివ్యంగ్యంగా ప్రశ్నించారు. రోజూ ఎంతో మంది తిరుగుతుంటారు.. దీన్ని క్లోజ్ చేద్దామన్న రెస్పాన్సిబిలిటీ ఉండదా? జీహెచ్ఎంసీ వాళ్లు రోడ్లపై తిరుగుతూ చూడరా? అస్తమానం ఎవరో ఒకరు కంప్లయింట్

మిగతా 3లో..

## దానం నాగేందర్ అనర్హత పిటిషన్



తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

మిగతా 2లో..

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదు

- భూభారతి సదస్సులు, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి
- ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు
- రూ.230కే సిమెంట్ బ్యాగ్.. పేదల సొంతింటి కల సాకారం

మిగతా 3లో..



- నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు స్థల పరిశీలన
- ఉమ్మడి నిజామాబాద్‌లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన

# పెట్టుబడులకు తెలంగాణాన్ని వేదికగా ఎంచుకోండి



- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం
- టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు.. అపార అవకాశాలు
- అభివృద్ధి... జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలి

మిగతా 4లో..

- మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి

# పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

- ఆధునికత సాంకేతికతపై ప్రదర్శన



హైదరాబాద్,ఆగస్ట్22 : నగరంలోని నెక్లెస్ రోడ్‌లో పీపుల్స్ ప్లాజాలో పవర్ ఎగ్జిబిషన్-2026 ఘనంగా ప్రారంభమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో విద్యుత్ రంగంలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికతల ను ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, వినియోగంలో చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులను

మిగతా 3లో..

# 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు

- భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్,ఆగస్ట్22 : రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూభారతి పోర్టల్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వేలాది

మిగతా 3లో..

## యూపి ఎన్నికల్లో పటిష్ట చర్యలు



- యోగి సహా 52మంది నేతలకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు

మిగతా 2లో..

## మీడియా అకాడమీ కార్యకలాపాలు అభినందనీయం



- ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రశంసలు

మిగతా 3లో..

# అక్రమ నిర్మానాలు తొలగిస్తాం

- అక్రమ నిర్మాణాదారులను ఎవ్వరినీ వదలం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ



హైదరాబాద్,ఆగస్ట్22 : అంజయ్యనగర్‌లోని అక్రమ నిర్మాణాలన్నీ తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలపై ఎవరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఘటనాస్థలి పక్కన భవనాల వారు ఖాళీ చేసి వెళ్లాలని రంగనాథ్ ఆదేశిం చారు. గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ఇద్దరు గాయ పడ్డారు. ఈ ఘటన విషయం తెలియడంతో అక్కడకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు ఇద్దరు మృతిచెందారని రంగనాథ్ తెలిపారు. బిల్డింగ్ యజమాని ఇంకా అందుబాటులోకి రాలేదని అన్నారు. ఈ బిల్డింగ్ నిర్మాణంపై సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్‌కి కొంత మంది ఫిర్యాదు చేశారని వెల్లడించారు. గతం లో హైడ్రాకు ఈ బిల్డింగ్ నిర్మాణంపై ఎలాం టి ఫిర్యాదు అందలేదని చెప్పారు. ఏడు అంత స్తులు, ఒక పెంట్ హౌస్ మొత్తం ఎనిమిది అంతస్తుల బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారని వివరించారు.నాలాను

మిగతా 3లో..

# కాళేశ్వరంతో ఎలాంటి సమస్యలు లేవు

- వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి
- మాజీమంత్రి జీవన్ రెడ్డి డిమాండ్



సిరిసిల్ల,ఆగస్ట్22 : తెలంగాణకు వరప్ర దాయిని కాళేశ్వరం ప్రాజెక్టులో బాగమైన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ క్లీన్‌చిట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల ఎక్సలెంట్, గుడ్ అని రిపోర్ట్ ఇచ్చిందని రిపోర్ట్ తో నైనా రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కళ్లు తెరవాలని హితవు పలికారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్‌నినోతో రాబోయే పంట కాలంలో సాగు నీటి కి ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నా యని అన్నారు. రెండు నెలల క్రితమే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటి ఆర్ కన్నెపల్లి పంపు హౌజ్ ను సంద ర్శించి, సాగు నీరు, తాగు నీటికి వచ్చే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించారని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తెస్తే కేసీఆర్ కు పేరొస్తుందని ప్రభుత్వ భేషజాలకు పోతుందని

మిగతా 3లో..

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా
# బొంపెల్లి భవాని

కామారెడ్డి,ఆగస్ట్22 : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రం లోని బాలికల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొంపెల్లి భవాని ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన 48 మందితో కూడిన జాబితాలో తెలంగాణ నుంచి ఆమెకు చోటు దక్కింది. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబరు 5న దిల్లీలో రాష్ట్రపతి చేతులమీదుగా ఆమె ఈ అవార్డు అందుకోనున్నారు. గాంధారి మండలానికి చెందిన భవాని 2018 నుంచి బాలికల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ.. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ల ద్వారా వినూత్న రీతిలో విద్యార్థులకు కృత్యాధార బోధన చేస్తూ పేరుపొందారు. తెలంగాణ ఎస్సీఈఆర్టీ 'ట్రయల్ బ్లేజర్స్' పేరిట ప్రచురించిన పుస్తకంలో.. అవరోధాలను అధిగమించి పాఠశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచారంటూ భవాని పాఠాన్ని అందులో చేర్చారు. సీఎం చేతుల మీదుగా ఆమె ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఏపీ నుంచి విజయనగరం జిల్లాకు చెందిన కౌలూరి రాజేష్, అండమాన్ నికోబార్ నుంచి తెలుగు వ్యక్తి జెల్లి ప్రకాశ్‌రావు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

## సాగునీరు అందించాలని రైతుల వినతి



వరంగల్,ఆగస్ట్22 : వరంగల్ జిల్లా వేలేరు మండలంలోని రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండల నాయకులు, రైతులు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి శనివారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని సాగు భూములకు గోదావరి జలాలు అందేలా పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగవంతం చేయాలని కోరారు. వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం కోసం ఎత్తిపోతల పథకాలు, పైప్‌లైన్, కాలువల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వేలేరు మండలానికి గండి రామారం ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందించి రెండు పంటలకు సాగునీరు కల్పిస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన హామీని గుర్తు చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారావు, సర్పంచ్ మరిజె అనిత, నాయకులు విజేందర్ రెడ్డి, జానీ, హరీఫ్ పాల్గొన్నారు.

# హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో పేలుడు



- ఇద్దరు కార్మికుల మృతి..క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలింపు

యాదాద్రి భువనగిరి,ఆగస్ట్22 : యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ భారీ శబ్దంతో పేలింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా.. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరా బాద్‌కు తరలించారు. కం పెనీలోని సి-బ్లాక్‌లో నైట్ షిఫ్ట్‌లో 18 మంది కార్మి కులు విధులు నిర్వహిస్తున్నారు. రియాక్టర్ వద్ద పను లు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలు డు సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపిం చడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి పెద్దవూర మండలానికి చెందిన చిన్న నాగిరెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన నాగన్న బోయిన నరేష్‌కుమార్ మృతి చెందారు. రియాక్టర్ సమీపంలో పనిచేస్తున్న మరో పది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రియాక్టర్ పేలిన శబ్దం భారీగా వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక కొం దరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్‌రెడ్డి, ఎస్సై జగన్ పోలీసు సిబ్బ ందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. చౌటుప్పల్, హయత్‌నగర్ నుంచిర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హేజో లేబొరేటరీస్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకో వడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జూలై 16న రసాయన వాయువులు పీల్చడంతో అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లు గ్రామానికి చెందిన ఆలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతి చెందినట్లు స్థానికులు తెలి పారు. ఆ ఘటన జరిగి నెల రోజులు కూడా పూర్తికాకముందే తాజాగా రియాక్టర్ పేలడంతో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం తర్వాత కంపెనీ పరిసరాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ఆవరణలో మురుగునీరు చేరి ఉండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ దుర్వాసన కారణంగా కొందరికి తలతిరగడం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురైనట్లు చెబుతున్నారు. కెమికల్ కంపెనీలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తగిన స్థాయిలో పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రియాక్టర్ పేలుడు, గతంలో కార్మికుడి మృతి ఘటనల నేపథ్యంలో కంపెనీలో భద్రతా ప్రమాణాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.

## డిఎస్సీపై చర్చకు సిద్ధం

- జగన్‌కు లోకేశ్ సవాల్



అమరావతి,ఆగస్ట్22 : డీఎస్సీపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఐదోసారి సవాల్ విసిరారు. 'టైమ్, డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. చర్చకు నేను సిద్ధం' అని ఛాలెంజ్ చేశారు. శనివారంవిజయనగరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పలు కీలక అంశాలపై తెలుగుదేశం పార్టీ కేడర్‌కు దిశానిర్దేశర చేశారు. టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని లోకేశ్ వ్యాఖ్యానించారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించే బాధ్యత తనదని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేసిన ఏకైక పార్టీ టీడీపీ అని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి మంచి ఫలితాలు సాధించాలని టీడీపీ కేడర్‌కు మంత్రి లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.

# కాంట్రాక్ట్ కండక్టర్ల ఆందోళన

### ఉద్యోగాల తొలింపుపై నిరసన



హనుమకొండ,ఆగస్ట్22 : వరంగల్ రీజియన్ ఆర్టీసీలో ఏడాది నుంచి 90 మంది కండక్టర్లు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. యాజ మాన్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే విధుల నుంచి తొలగించింది. దీంతో వారు శనివారం హనుమకొండలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సంవత్సరం నుంచి తమతో విధులు చేయిం చుకుని, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీకి సం బంధించిన పలు కీలక సమయాల్లో మేడారం మహాజాతరను విజయవంతం చేయడంలో తమ పాత్ర ఎంతో ఉందని అన్నారు. అలా తమ సేవలను వినియోగిం చుకున్న తర్వాత అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగిం చడంతో తమ కుటుంబాలు ఇబ్బందుల్లో పడే పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, తమ కుటుం బాలను రోడ్డున పడకుండా ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరా రు. ఆర్టీసీ సంస్థ కు చెందిన కొన్ని ఔట్‌సోర్సిం గ్ ఏజెన్సీ లు తమను తీసుకుని ఇప్పుడు తొలగించడం అన్యాయమని, డబ్బులు ఇచ్చినవారిని తొలగించలేదని వాపోయారు. గత ఆర్ఎం- ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు కుమ్మక్కయ్యారని, డిసెంబర్ వరకు అగ్రిమెంట్ ఉన్నా కూడా చెప్పకుండా అకారణంగా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీలు కొంత మంది వద్ద డబ్బులు తీసుకుని ఇప్పుడు తొలగించాలరని, ఇందులో ముఖ్యంగా చంద్రశేఖర్ ఏజెన్సీ ఎక్కువ మందిని తీసుకు న్నట్లు వారు ఆరోపించారు. డబ్బులు తీసుకుని నియమించిన ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల యజమానులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్ఎం భవానీప్రసాద్‌ను వివరణ కోరగా 'ఎవరైతే కాంట్రాక్ట్ పూర్తయిందో వారిని తొలిగించా మని, వారిని తీసుకున్న ఏజెన్సీలను అడగాలని సమాధానం' ఇచ్చారు.

## ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌తో యూరియాకు కొరత

### తక్షణం జోక్యం చేసుకోవాలన్న మంత్రి తుమ్మల



హైదరాబాద్,ఆగస్ట్22 : రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) షట్‌డౌన్‌పై తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. దీని వల్ల సుమారు 10 రోజుల పాటు యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్ప డుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా డిమాండ్ అధికంగా ఉన్న వేళ ఈ షట్‌డౌన్ ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాశారు. గత ఖరీఫ్ సీజన్‌లో112 రోజుల పాటు ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపి వేశారని గుర్తు చేశారు. ఈ సంస్థ తరచూ షట్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో యూరి యా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా రైతులకు యూరియా అందించడంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకమని ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం షట్‌డౌన్‌ను త్వరగా ముగించి యూరియా ఉత్పత్తిని పునరుద్ధరిం చాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని ఆయన కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ లోటును ఇతర దేశీయ ఎలాంట్లు, దిగుమతుల ద్వారా భర్తీ చేయా లని కేంద్రానికి ఆయన విన్నవించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా తగినంత యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. నేటి (ఆగస్టు 22) నుంచి రామగుండం ఎరువుల కర్మాగారాన్ని షట్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే.

# రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు

- సిఎం అమెరికా పర్యటన తిరస్కరించడం నిరంవకుశం
- మంత్రి పొన్న ప్రభాక్ విమర్శలు






సిద్దిపేట,ఆగస్ట్22 : తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పల్లె పల్లెలెకు పొన్నం అన్న- ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్-2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యా యంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కేం ద్రం సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్డీయే ప్రభు త్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు. జకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలి పారు. కేంద్రం కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 'ప్లలె ప్లలెకు పొన్నం అన్న- ప్లలె ప్లలెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

## గచ్చిబౌలిలో కుప్పకూలిన ఏడంతుస్తుల భవనం

### ఇద్దరు మృతి.. మరొకరికి తీవ్ర గామాలు



హైదరాబాద్,ఆగస్ట్22 : గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడం తస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెం దగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే, నాలాను ఆనుకుని 50 గజాల్లో అక్రమంగా ఈ భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం కూలిన పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై శకలాలు పడ్డాయి. భయంతో పక్కనే ఉన్న హాస్టల్లోకి విద్యార్థులు పరుగులు తీశారు. ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ ఎలానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలోటౌన్‌ఎలానింగ్ అధికా రులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రమంగా బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాల నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. అయిన హైడ్రా, సీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## దానం నాగేందర్ అనర్హత పిటిషన్

### తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

హైదరాబాద్,ఆగస్ట్22 : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

## యూపి ఎన్నికల్లో పటిష్ట చర్యలు

### యోగి సహా 52మంది నేతలకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు

న్యూఢిల్లీ,ఆగస్ట్22 : ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్య నేతలకు బులలెట్ ప్రూఫ్ జాకెట్లను అందజేశారు. సుమారు 52 మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ఖరీదు సుమారు 10 లక్షలు ఉన్నట్లు భావిస్తున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ చీఫ్ మాయావతికి కూడా ఆ జాకెట్లను అందజేశారు. భద్రతలో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. వీరితో పాటు ఆ జాబితాలో 11 మంది మంత్రులు ఉన్నారు. సంజయ్ నిషాద్, నంద్ గోపాల్ గుప్తా, ఓం ప్రకాశ్ రాజ్‌భర్, బీజేపీ నేత అపర్ణయాదవ్ ఉన్నారు. తొలి దశలో 8 మందికి , రెండో దశలో 44 మందికి జాకెట్లను అందజేశారు. బీజేపీ నేతలు స్వతంత్ర దేవ్ సింగ్, జైవీర్ సింగ్, మహేంద్ర సింగ్‌కు కూడా జాకెట్లు ఇచ్చారు. యూపీలోని సుమారు 98 మంది ఇతర ముఖ్య నేతలకు ప్రత్యేకమైన భద్రతను కల్పించనున్నారు.

## ఇందిరమ్మ లబ్దిదారుల నుంచి డబ్బు వసూళ్లు

### గ్రామపంచాయితీ కార్యదర్శిపై అంతర్గత విచారణ

నిర్మల్,ఆగస్ట్22 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలం నిఘ్వ గ్రామపంచాయతీ కార్యదర్శి సింధుజా పై అధికారులు విచారణ ప్రారంభించారు. గ్రామంలోని ఇద్దరు ఇందిరమ్మ లబ్దిదారుల వద్ద డబ్బులు తీసుకున్న వ్యవహారంలో కార్యదర్శి ఆరు నెలల క్రితం సస్పెండ్ అయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం కుభీర్ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో నాగవర్ధన్, ఎంపీడీవో శ్రీనివాస్ , ఎంపీవో భీమేష్, జిల్లా పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షాహిద్ అంతర్గత విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్దిదారులు నందాబాయి, సోమాబాయి, సస్పెండ్ అయిన పంచాయతీ కార్యదర్శి సింధుజాతో అంతర్గత విచారణ జరిపారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో సస్పెండ్ అయిన సింధుజాపై అంతర్గత విచారణ జరిపి వేర్వేరుఏగా వాంగ్మూలాల ను నమోదు చేశారన్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఎంపీడీవో వివరించారు.

# రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

హైదరాబాద్,ఆగస్ట్22: రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధి ఖాజాగూడలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ సమీపంలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. రాయదుర్గం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ము గ్గురు యువకులు బైక్‌పై ఖాజాగూడ నుంచి గచ్చిబౌలి అంజయ్య నగర్‌వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో స్టాఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ 2వ గేటు సమీపంలో కేర్ హాస్పిటల్ మెయిన్ రోడ్డు వైపు మలుపు తీసుకుంటుండగా బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో పశ్చిమ్‌బెంగాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అబ్బాస్ సిద్ధిక్ (25) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అదే రాష్ట్రానికి చెందిన బైక్ నడిపిన సహస్ర ఛటోపాధ్యాయ (25), వెనుక కూర్చున్న అభిజిత్ సింగ్ (25) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు. సిద్ధిక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## (మొదటిపేజీ తరువాయి)

# అక్రమ నిర్మాణానికి బలైన ప్రాణాలు

మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒక్కసారిగా కుప్ప కూలింది. దాంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భవనం శిథిలాలు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై పడటంతో అది కూడా పాక్షికంగా దెబ్బతింది. అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఇద్దరు వృద్ధులు గాయపడినట్టు సమాచారం. గోడలు, నిర్మాణ భాగాలు దెబ్బతినడంతో నివాసితులు భయంతో బయటకు పరుగులు తీశారు. పక్కనే ఉన్న హాస్టల్ విద్యార్థులు కూడా భయాందోళనకు గురై బయటకు వచ్చారు.

### రంగంలోకి భారీ రెస్క్యూ బృందాలు

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది, ఎస్అర్ఎఫ్, సీఎంసీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ యంత్రాలతో శిథిలాలను తొలగించి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. వారిని మధ్యప్రదేశ్‌కు చెందిన టైల్స్ కార్మికులు ఉమేశ్ కారే (34), మోపత్ (42)గా గుర్తించారు. శిథిలాల కింద మరెవరైనా చిక్కుకుని ఉన్నారా అనే అనుమా నంతో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో ఎక్కువ మంది లేకపోవడంతో ప్రాణనష్టం పరిమితంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇదే ప్రమాదం సాయంత్రం సమయంలో జరిగి ఉంటే భారీగా ప్రాణనష్టం జరిగేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన పరిశీలించారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను ఎలాంటి వెనుకంజ లేకుండా నేలమట్టం చేస్తామని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు.

### అనుమతులు లేకుండానే నిర్మాణమా?

ఈ భవనం నిర్మాణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీఎంసీ నిబంధనలకు విరుద్ధంగా సరైన అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ నాణ్యతపై కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్కువ వ్యవధిలోనే భారీ అంతస్తులు నిర్మించడంతోనే భవనం బలహీనంగా మారి కుప్పకూలిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా అంజయ్యనగర్, సిద్ధిక్‌నగర్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణాలు, భవన నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, నిర్మాణంలో పాటించిన ప్రమాణాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని స్థానికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి ప్రభుత్వ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

### బిల్డర్ కోసం పోలీసుల గాలింపు

భవనం నిర్మాణానికి సంబంధించిన బిల్డర్ సాజిద్ కోసం పోలీసు లుగాలిస్తున్నట్టుసమాచారం.భవనానికి అనుమతులు ఉన్నా యా? నిర్మాణంలో నిబంధనలు పాటించారా? నిర్మాణ నాణ్యతను ఎవరు పర్యవేక్షించారు? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# పవర్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన భట్టి

ప్రజలకు పరిచయం చేయడం ఈ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో విద్యుత్ భద్రతా చర్యలు, పునరుత్పాదక ఇంధన వనరులకు సంబంధించిన ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. స్మార్ట్ మీటరింగ్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ఛార్జింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలను ప్రజలు ప్రత్యక్షంగా తెలుసుకునేలా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.

# అక్రమ నిర్మానాలు తొలగిస్తాం

అతిక్రమించి ఈ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోందని రంగనాథ్ అన్నారు. చుట్టుపక్కల ఉన్న భవనాలను పరిశీలించి త్వరలోనే కూల్చివేస్తామని తెలిపారు. బిల్డర్ సాజిద్ 50 గజాల్లో భవనాలు కట్టి హాస్టళ్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. సాజిద్ పరారీలో ఉన్నారని చెప్పారు. 50 గజాల్లో ఈ బిల్డింగ్ నిర్మించారని వెల్లడించారు. హాస్టల్ బిల్డింగు లను నిర్మించి.... రెంట్‌కు ఇస్తుంటాడని చెప్పారు. హైడ్రా ఈ ఘటన సహాయక చర్యల్లో పాల్గొంటుందని.... ప్రస్తుతం సహా యక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడిం చారు. శిథిలాల కింద అదృష్టవశాత్తూ ఇంకెవరూ ఉండకపోవచ్చని భావిస్తున్నామని రంగనాథ్ పేర్కొన్నారు. అలాగే, ఈ ఘటన గురించి సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడారు. గతంలోనే ఈ నిర్మాణా లపై తమకు ఫిర్యాదులు

# నిషేధిత జాబితా పేరుతో వేధింపులు

ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కోడై కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ం భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి మీ సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ం నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

# సచివాలయం ముందు పెద్ద గుంత

వచ్చాయని తెలిపారు. నాలుగు నెలల క్రితమే ఈ నిర్మాణ పనులను ఆపేసి, సీజ్ చేశామని వెల్లడించారు. మళ్లీ నిన్న వర్క్ మొదలుపెట్టారని చెప్పారు. ఈరోజు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యామని అన్నారు. ఈ లోపు ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెప్పారు. ఈ నాలాను ఆక్రమించి నిర్మాణలు చేస్తున్నారన్నారు. ఈ బిల్డింగ్ చుట్టూ చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని అన్నారు. హాస్టల్ బిల్డింగ్ కోసం ఈ నిర్మాణాన్ని చేపట్టారని సృజన తెలిపారు.ఇస్తేనే తెలుస్తుందా? అని నిలదీశారు. వీలైనంత తొందరగా దీనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. అంతేకాకుండా.. లోపల ఇలాంటివి చాలా ఉన్నాయ్.. లోపల దాచిపెట్టాం అని జీహెచ్ఎంసీ అన్నట్లుగా క్యాప్షన్ పెట్టాడు. పోస్టు వైరల్‌గా మారడంతో హైదరాబాద్ రోడ్ల పరిస్థితి, కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే కేటీఆర్ కూడా స్పందించారు. లంకెబిందెల కోసం తవ్వుతున్నారేమో అని వ్యంగ్యంగా కామెంట్ పెట్టారు. దీనికి నవ్వుతున్న ఎమోజీని కూడా జత చేశారు. దీంతో కేటీఆర్ కామెంట్ కూడా వైరల్‌గా మారింది.

# కాళేశ్వరంతో ఎలాంటి సమస్యలు లేవు

విమర్శించారు.కన్నెపల్లి నుంచి వృథాగా దిగువన నీరు పోతున్నదని, చంద్రబాబు కోసం గురు దక్షణగా నీటిని రేవంత్ రెడ్డి అందజేస్తున్నారని విమర్శించారు. కన్నెపల్లి పంపు హౌజ్ వద్ద రూ.100 కోట్ల తో కాఫర్ డ్యాం కట్టి వినియోగంలోకి తేవాలని సూచించారు. కేసీఆర్ దూర దృష్టితో కాళేశ్వరం కట్టారని గుర్తు చేశారు.

# 22ఏ నిషేధిత భూముల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలు

ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి దండుకోగా.. కాంగ్రెస్ హయాంలో అది లక్షలాది ఎకరాలకు చేరిందని విమర్శించారు. హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాత్రికి రాత్రే ప్రైవేటు భూములను 22ఏ జాబితాలో పెట్టి ప్రభుత్వం వేధిస్తోంది. దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్న భూములను నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారు? ప్రజల వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం సీఎం ఇంటిని నిషేధిత జాబితాలో చేర్చారా? ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నవ్వులపాలైంది. బీఆర్ఎస్ 10శాతం కమిషన్ తీసుకుంటే.. కాంగ్రెస్ 30 శాతం తీసుకుంటోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఓపెన్ భూములను అమ్మాలని చూస్తున్నారు. ప్రైవేటు భూముల్లో 50శాతం కమిషన్ అడుగుతున్నారు. ప్రభుత్వ భూముల్ని ఎందుకు అమ్ముతున్నారో సమాధానం చెప్పాలి. రియల్ ఎస్టేట్ కంపెనీలను బెదిరించి వాటాలు తీసుకుంటున్నారు. భాజపా అధికారంలోకి వచ్చాక ఈ భూములపై మళ్లీ పరిశీలన చేస్తాం. ఎమ్మెల్యేకు ఇష్టంలేకపోతే ఆ భూమి 22ఏలోకి వెళ్లిపోతుంది. ఈ భూముల విషయంలో భాజపా లీగల్ సెల్ ప్రజలకు సహాయం అందిస్తోంది. ప్రాముఖ్యతను బట్టి ముఖ్యమంత్రికి విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తారు. విదేశీ పర్యటనలపై కాంగ్రెస్ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు.

# మీడియా అకాడమీ కార్యకలాపాలు అభినందనీయం

## ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రశంసలు





హైదరాబాద్, ఆగస్టు 22 : జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాల పెంపు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు తెలంగాణ మీడియా అకాడమీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని దేశంలోని పలు రాష్ట్రాలతో ఏర్పడ్డ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ప్రశంసించారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధి బృందం శనివారం మధ్యాహ్నం తెలంగాణ మీడియా అకాడమీ భవనాన్ని సందర్శిం చింది. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ప్రతినిధులకు అకాడమీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అకాడమీ కార్యదర్శి నాగుళ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. సందర్భంగా జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అక్రిడిటేషన్ సేవలు, విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అందిస్తున్న రూ.1 లక్ష ఆర్థిక సహాయం, వారి పిల్లలకు అందిస్తున్న ట్యూషన్ ఫీజు సహాయం, అలాగే జర్నలిస్టు కుటుంబాలకు అందిస్తున్న ఇతర సంక్షేమ కార్యక్రమాలను ప్రతినిధులకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తుండటం పట్ల ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులందరూ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 23,000 మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తూ, జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు మరియు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ఒక వినతిపత్రాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి, వాటిని సంబంధిత ఎంపీలు మరియు అన్ని రాజకీయ పార్టీల దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, వర్క్‌షాపులు, అవగాహనా కార్యక్రమాల గురించి వివరించారు. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనే జర్నలిస్టులకు ఉపయోగపడేలా అకాడమీ ప్రచురిస్తున్న మోనోగ్రాఫ్లు, పుస్తకాలు అందిస్తున్న విధానాన్ని కూడా ప్రతినిధులు పరిశీలించారు. అకాడమీ కోసం నిర్మించిన ఆధునిక సౌకర్యాలతో కూడిన ఐదు అంతస్తుల భవనం, శిక్షణా తరగతులు, గ్రంథాలయం, కంప్యూటర్ సౌకర్యాలు, సమావేశ మందిరం, 250 మంది సామర్థ్యం కలిగిన సెంట్రల్ ఏసీ ఆడిటోరియం తదితర సౌకర్యాలను ప్రతినిధి బృందం సందర్శించింది. జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇంతటి సమగ్ర మౌలిక వసతులతో అకాడమీ పనిచేయడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఏర్పడిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ కేవలం మరో సంస్థగా కాకుండా దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు బలమైన వేదికగా ఎదగాలని ప్రతినిధులు ఆకాంక్షించారు. జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఫెడరేషన్ మరింత క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని, ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమం మరియు శిక్షణ రంగాల్లో అకాడమీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఫెడరేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు ప్రతినిధి బృందానికి అకాడమీ కార్యకలాపాలు, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు అందించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్బుకు చెందిన నీలేష్ కాంతాహా, హరీష్ పగిడే, సంజయ్ మహతా (మధ్యప్రదేశ్), సోనాలి యాదవ్, దీపక్ మహేశ్వరీ, ఉదిత్ తండ్, ఉమాలీ తండ్, లక్షణ్ ఫండ్, యాష్ వర్ధన్ సింగ్, రచనా జోషి, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రెసిడెంట్ గౌతమ్ పహాని, డా. స్నేహాశిస్ సూర్, జనరల్ సెక్రటరీ సౌరభ్ దుగ్గల్, మెంబర్ అనిల్ సింగ్, సెక్రటరీ జనరల్ రాజేష్ ధల్, మెంబర్ రమేష్ హండా, ట్రెజరర్ నీరజ్ ఠాకూర్, వివేక్ ముఖర్జీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ రెడ్డి, సెక్రటరీ రమేష్, ఏ. రాజేష్, మిడియా అకాడమీ మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఓ.ఎస్.డి. ఎమ్.కె. రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు పేరు




- ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీ
- బ్రిక్స్ దేశాల మంత్రుల సదస్సులో చంద్రబాబు



విశాఖపట్నం,ఆగస్ట్ 22:ఉద్యోగాలు, ప్రతిభకు దేశంలోనే నంబర్‌వన్ సిటీగా విశాఖపట్నం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శనివారం విశాఖ పట్నంలో జరిగిన బ్రిక్స్ దేశాల యువజన, క్రీడ శాఖల మంత్రుల సాంస్కృతిక కార్యక్రమం 2026కు సీఎం హాజరయ్యారు. బ్రిక్స్ దేశాల ప్రతినిధులకు సీఎం స్వాగతం పలికారు. భారత తూర్పు తీరంలో విశాఖ దేశానికే ఆభరణమని అభివర్ణించారు. సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖను పిలుస్తారని బ్రిక్స్ దేశాల మంత్రులకు వివరించారు.సీఎం చంద్రబాబు ప్రసంగించారు. మహిళలకు అత్యంత సురక్షితమైన నగరాల్లో విశాఖ నగరం అగ్రస్థానంలో ఉందని ఉద్ఘాటించారు. మారిటైమ్ గేట్‌వేగా, టెక్నాలజీ – ఇన్నోవేషన్ హబ్‌గా విశాఖను తీర్చి దిద్దుతున్నట్లు వ్యాఖ్యానించారు. వాటర్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ టూరి జానికి విశాఖలో అపార అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. యువత ఆకాంక్షలకు ప్రతీకగా విశాఖ నగరాన్ని తీర్చి దిద్దుతున్నట్లు పేర్కొన్నారు. భాష, సంస్కృతి, భౌగోళికంగా భిన్నమైనా.. క్రీడల తో బ్రిక్స్ దేశాల ఐక్యత ఉండాలని సీఎం చంద్ర బాబు ఆకాంక్షించారు. క్రీడలు పోటీ మాత్రమే కాదని... సంస్కృతి, జీవన విధానమని తెలిపారు. యువతలో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు, యోగా, ధ్యానం వంటివి భారతీయ విధానమని వెల్లడించారు. ఆరోగ్యవంతమైన పౌరులతోనే బల మైన సమాజం ఉంటుందని వివరించారు. క్రీడల తో అలథెట్లు, కోచ్‌లు, ట్రైనర్లకు ఉపాధి అవకా శాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. స్పోర్ట్స్ టూరి జంతో పెట్టుబడులు, అంతర్జాతీయ ఈవెంట్లకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో స్టేట్ అకాడమీలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో సమగ్ర క్రీడా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కేంద్రంగా పూర్తి స్థాయి స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ వస్తుందని స్పష్టం చేశారు. నెల్లూరు కేంద్రంగా స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, అపెరల్, టెక్నాలజీ తయారీ కంపెనీలు వస్తున్నాయని తెలి పారు. అంతర్జాతీయ వాటర్ స్పోర్ట్స్ డెస్టినేషన్‌గా విశాఖను తీర్చిదిద్దు తామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రపంచ స్థాయి క్రీడా ఈవెంట్ల నిర్వహణెలి లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. బ్రిక్స్ దేశాలతో క్రీడా భాగస్వామ్యానికి ఏపీ సిద్ధమని వివరించారు. విశాఖ కేంద్రంగా బ్రిక్స్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు ప్రతిపాదన చేస్తున్నామని వెల్లడించారు. బ్రిక్స్ దేశాల మధ్య అలథెట్లు, కోచ్‌ల పరస్పర మా ర్పిడికి అవకాశం ఉందని చెప్పారు. వాటర్ స్పోర్ట్స్, అంతర్జాతీయ ఈవెంట్లు, స్పోర్ట్స్ టూరిజంలో పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని అన్నారు. నైపుణ్యం కలిగిన యువత, సాంకేతిక వ్యవస్థ, సుదీర్ఘ తీరప్రాంతం ఏపీ బలమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ఐ

హైదరాబాద్,ఆగస్ట్22 : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని చందానగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బాలరాజు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లు రఘు, రాజ్‌కుమార్‌లను కూడా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. బాధితుడి నుంచి లక్ష రూపాయిలు లంచం తీసుకుంటుండగా.. ఎస్ఐతోపాటు కానిస్టేబుళ్లను ఏసీబీ అధికారులు వలపన్నీ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి లంచం సొమ్మును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారందరిని పోలీస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. లంచం వ్యవహారంలో పూర్తి వివరాలను వారి నుంచి ఏసీబీ అధికారులు సేకరిస్తున్నారు.

# పవన్ ఆదేశాలతో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం

అమరావతి,ఆగస్టు 22 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్దేశకత్వంతో శరవేగంగా అడవుల పునరుద్ధరణ కార్యక్రమం కొనసాగుతోంది. డిప్యూటీ సీఎం ఆదేశాలతో జోరుగా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 20 వేల హెక్టార్లలో 2 కోట్లకు పైగా సీడ్ బాల్స్‌ను అధికారులు వెదజల్లారు. ఈ మేరకు 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్య సాధనలో కీలక అడుగు పడింది. అడవుల పునరుద్ధరణ పక్రియలో డ్రోన్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోంది. తిరుపతి, అనంతపురం, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం, ఎన్టీఆర్, విశాఖపట్నం జిల్లాల పరిధిలో విస్తృతంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సీజన్‌లో 3 కోట్లకు పైగా విత్తన బంతులు వెదజల్లాలని లక్ష్యంగా అధికారులు తీసుకున్నారు. సీడ్ బాల్స్ విస్తరణ పక్రియ సరికొత్త మైలురాయిని చేరుకున్న సందర్భంగా అటవీశాఖ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరినీ పవన్ కల్యాణ్ అభినందించారు.

# నూకరాజు భార్య మీనా మృతదేహం లభ్యం

కాకినాడ,ఆగస్టు 22 : పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజు భార్య మీనా మృతదేహం శనివారం లభ్యమైంది. ఆత్మహత్య చేసుకున్న 7 రోజుల తర్వాత ఆత్రేయపురం మండలం మూలస్థానం అగ్రహారం దగ్గర గోదావరిలో మీనా మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. గత ఆదివారం రాత్రి భార్య, కుమార్తె, మనవడితో సహా నూకరాజు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రోడ్‌కం రైలు బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకారు. మనవడు కార్తికేయ నదిలో ఈదుకుంటూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ నెల 17వ తేదీన నూకరాజు, 20వ తేదీన సౌజన్య మృతదేహాలు లభ్యమయ్యాయి. ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో నిందితుడు సాదిక్ ఖాన్ పోలీసులకు పట్టుబడినట్టు తెలిసింది.

# మా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నారు

- పిసిసి క్రమశిక్షణా సంఘానికి కొండా సురేఖ మరో లేఖ
- కూతురు వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదన్న మల్లు




హైదరాబాద్, ఆగస్టు 22 : టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ మరో లేఖ రాశారు. తనను, తన కుటుంబాన్ని కొందరు లక్ష్యంగా చేసుకున్నారన్నారు. తనను లక్ష్యంగా చేసుకొని అవమాన కరగా వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న వ్యక్తుల్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవిని కోరారు. కమిటీ నోటీసుకు ఇప్పటికే వివరణ ఇచ్చానని, అయినా పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలు బహిరంగంగా అవమానకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై బహిరంగంగా విమర్శలు చేయడం సరికాదని, దీన్ని కమిటీ పరిశీలించాలని కోరారు. అవమానకర వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. వెనుక ఉండి వ్యవహారాన్ని నడిపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విచారణ కొనసాగుతుండగానే తనపై బహిరంగ విమర్శలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం, చర్యలు కోరడం వెనుక ఉద్దేశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అన్నది పరిశీలించాలని సురేఖ కోరారు. సీనియర్ బీసీ మహిళా నాయకురాలిపై సామూహిక దాడులు జరుగుతున్నా పార్టీ మౌనం వహించడం ఆందోళనకరమని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు విరుద్ధంగా వ్యవహరించేవారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ డిమాండ్ చేశారు. మరోవైపు, మంత్రి సురేఖ లేఖ రాయడానికి ముందు ఈ వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి స్పందించారు. సురేఖ ఇచ్చిన వివరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కుమార్తె వ్యాఖ్యలను ఒక మంత్రిగా ఆమె ఖండించాలని సూచించారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం తనకు సంబంధం లేదని సురేఖ చెబుతున్నారన్నారు. సురేఖ వివరణపై ఎప్పుడు చర్యలు తీసుకుంటామో చెప్పలేమన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె వ్యాఖ్యలపై కొండా సురేఖ వివరణ చూశామని తెలిపారు. 'ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాటల వీడియో కూడా పరిశీలించాం.. ఆయన ఇచ్చిన వివరణను సైతం కమిటీ పరిశీలించింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో ప్రొసీజర్ ప్రకారం వెళ్తాం.. రాజగోపాల్ రెడ్డిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు.. వ్యాఖ్యలపై సుమోటోగా తీసుకోవాలా? లేదా?అనేది పరిశీలిస్తున్నాం' అని మల్లు రవి ఈ సాయంత్రం మీడియాకు తెలిపారు.

# పెట్టుబడులకు తెలంగాణా రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకోండి

- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా ఎదగడమే లక్ష్యం
- టెక్నాలజీ నుంచి జీవశాస్త్రాల వరకు.. అపార అవకాశాలు
- అభివృద్ధి... జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు విస్తరించాలి
- మంత్రి ఎన్ .ఉత్తమ్ కుమార్ రెడ్డి




హైదరాబాద్,ఆగస్టు 22: తెలంగాణకు రండి...తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి...తెలంగాణలోనేఆవిష్కరించండి. ప్రపంచానికి అవసరమైన పరిష్కా రాలను ఇక్కడే ఊహిద్దాం...ఇక్కడే ఆవిష్కరిద్దాం...ఇక్కడి నుంచే ప్రపంచానికి అంది ద్దాం'అంటూ రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రపంచ వ్యాపార, పారిశ్రామిక, సాంకేతిక రంగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, నవకల్పనకు వెన్నుదన్నుగా నిలిచే యువశక్తి, పెట్టుబడులకు వేగంగా స్పందించే పారదర్శక ప్రభుత్వం ఈ నాలుగు బలమైన స్తంభాలపై తెలంగాణ ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వం కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శనివారం జరిగిన 'గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అండ్ లీడర్‌షిప్ కాన్క్లేవ్-2026'లో ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యోపన్యాసం చేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రస్థానం కేవలం గణాంకాల్లో కనిపించే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడం, యువతకు ఉపాధి కల్పించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భవిష్యత్ తరాలకు సుస్థిరమైన అభివృద్ధి పునాదులు నిర్మించడం తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2025?26లో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (ఉ÷ూఆఖ) సుమారు రూ.17.82 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో నామమాత్రపు వృద్ధి రేటు 8 శాతంగా ఉండగా, తెలంగాణ 10.7 శాతం వృద్ధి నమోదు చేయడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అంతర్గత శక్తికి, విస్తరిస్తున్న అవకాశాలకు నిదర్శనమన్నారు. ఈ వృద్ధిని మరింత వేగవంతం చేస్తూ తెలంగాణను దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తుల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపొందించిన 'తెలంగాణ రైజింగ్?2047' దార్శనిక ప్రణాళిక రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన దిశానిర్దేశర చేస్తోందని ఉత్తమ్ పేర్కొన్నారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న మహత్తర లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇది కేవలం భారీ ఆర్థిక లక్ష్యం మాత్రమే కాదని, సంపద సృష్టితోపాటు ఆ సంపద ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరేలా సమ్మిళిత అభివృద్ధిని సాధించాలన్న సంకల్పమని వివరించారు. ఈ లక్ష్యసాధన కోసం రాష్ట్రాన్ని పరస్పరం అనుసంధానమైన మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసే వ్యూహాన్ని ప్రభుత్వం అనుసరిస్తోందని తెలిపారు. టెక్నాలజీ, అత్యున్నత విలువ కలిగిన పరిశ్రమలు, సేవారంగాలకు కేంద్రంగా పట్టణ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే అజఖీఇ, నగర పరిసర ప్రాంతాల్లో తయారీ, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలను విస్తరించే ఖజఖీఇ, వ్యవసాయం, ఆహార శుద్ధి, గ్రామీణ పారిశ్రామిక రంగాలకు కొత్త జీవం పోసే ఖీంఖీఇ?ఈ మూడు ప్రాంతాలు తెలంగాణ సమగ్ర ఆర్థిక పురోగతికి పరస్పర పూరక శక్తులుగా నిలుస్తాయని వివరించారు. అభివృద్ధి హైదరాబాద్ చుట్టూ గీసుకున్న సరిహద్దుల్లో ఆగిపోకూడదు. అది ప్రతి జిల్లాకు చేరాలి... ప్రతి పట్టణాన్ని తాకాలి... ప్రతి గ్రామంలో కనిపించాలి... ప్రతి తెలంగాణ కుటుంబం జీవితంలో మార్పుగా ప్రతిఫలించాలి' అని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం రావాలంటే అవకాశాలు కొద్ది ప్రాంతాలకు, కొద్ది వర్గాలకు పరిమితం కాకుండా రాష్ట్రం నలుమూలలా విస్తరించాలన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సమాచార సాంకేతికత, కృత్రిమ మేధ, ఔషధ తయారీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు అంతర్జాతీయ కేంద్రంగా తనదైన ముద్ర వేసిందని మంత్రి పేర్కొన్నారు. ఈ బలమైన పునాదిపై సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో అపారమైన పెట్టుబడి అవకాశాలు ఆవిష్కృతమవుతున్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాపార సంస్థలు తెలంగాణను కేవలం మార్కెట్‌గా కాకుండా పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, ప్రపంచ మార్కెట్లకు విస్తరణకు వ్యూహాత్మక కేంద్రంగా చూడాలని కోరారు. తాను నిర్వహిస్తున్న నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖల పరిధిని ప్రస్తావిస్తూ నీరు?వ్యవసాయం?ఆహార భద్రత?పరిశ్రమల మధ్య ఏర్పడుతున్న అనుసంధానం భవిష్యత్ పెట్టుబడులకు మరో విశాలమైన ద్వారం తెరుస్తోందని ఉత్తమ్ చెప్పారు. సాగునీటి నిర్వహణను మరింత శాస్త్రీయంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఉపగ్రహ చిత్రాలు, కృత్రిమ మేధ, డ్రోన్లు, సెన్సర్లు, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే రంగాల్లో పెట్టుబడులను తెలంగాణ స్వాగతిస్తోందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం నీటి ప్రతి చుక్కను మరింత విలువైనదిగా మార్చగలదని, రైతుకు మరింత భరోసా కల్పించగలదని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులను కేవలం ముడిసరుకుగా బయటకు పంపే పరిస్థితి నుంచి రాష్ట్రంలోనే శుద్ధి చేసి, విలువ జోడించి, బ్రాండ్‌గా తీర్చిదిద్ది, ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి చేసే స్థాయికి తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. అందుకోసం ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్లు, గిడ్డంగులు, వ్యవసాయ లాజిస్టిక్స్, ప్యాకేజింగ్, ఎగుమతుల రంగాల్లో భారీ పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. వ్యవసాయానికి పరిశ్రమను అనుసంధానించడం ద్వారా రైతుకు మెరుగైన ధర లభించడంతోపాటు గ్రామీణ యువతకు వారి ప్రాంతాల్లోనే ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని చెప్పారు. పెట్టుబడిదారులు హైదరాబాద్‌ను దాటి తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలు, అభివృద్ధి కేంద్రాల వైపు కూడా దృష్టి సారించాలని ఉత్తమ్ కోరారు. వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ వంటి నగరాలు భవిష్యత్ పారిశ్రామిక, సేవా, లాజిస్టిక్స్, ఆహార శుద్ధి కేంద్రాలుగా ఎదగగల అపార సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు. పెట్టుబడులు జిల్లాలకు విస్తరించినప్పుడే స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయని, అభివృద్ధి నిజమైన అర్థంలో ప్రజాస్వామ్యీకరణ చెందుతుందని పేర్కొన్నారు. స్టార్టప్‌లు, గ్రామీణ ఆవిష్కర్తలను ప్రోత్సహిస్తున్న డాక్టర్ జె.ఎ. చౌదరి, ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ కృషిని మంత్రి అభినందించారు. వ్యాపార విజయాన్ని కేవలం ఆదాయం, లాభాలు, కంపెనీల విలువలతో కొలిచే కాలాన్ని దాటి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ని జీవనోపాధులు సృష్టించాం, ఎంతమంది యువ తకు అవకాశాలు కల్పించాం, సమాజం ఎదుర్కొంటున్న ఎన్ని సమస్యలకు పరిష్కారాలు కనుగొన్నాం అన్నదే నిజమైన వ్యాపార నాయకత్వానికి కొలమానం కావాలని అభిప్రాయపడ్డారు. తెలంగాణ కోరుకుంటున్న పెట్టుబడులు కేవలం మూలధనాన్ని తీసుకురావడానికే పరిమితం కాకూడదని ఉత్తమ్ స్పష్టం చేశారు. అవి ఉపాధిని సృష్టించాలి, జ్ఞానాన్ని పంచాలి, సాంకేతికతను బదిలీ చేయాలి, సుస్థిర పరిశ్రమలకు పునాది వేయాలి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలి. ప్రభుత్వం కూడా పెట్టుబడిదారులతో తాత్కాలిక అనుబంధాన్ని కాకుండా పారదర్శకమైన, వృత్తిపరమైన, వేగంగా స్పందించే దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం తగదు

- భూభారతి సదస్సులు, సాదాబైనామా అర్జీలను వెంటనే పరిష్కరించాలి
- ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు
- రూ.230కే సిమెంట్ బ్యాగ్.. పేదల సొంతింటి కల సాకారం
- నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌కు స్థల పరిశీలన
- ఉమ్మడి నిజామాబాద్ లో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన



నిజామాబాద్,ఆగస్ట్22 : రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం నాడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి గారు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారం లో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. 43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ, నూతన గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో పేదలకు తగిన స్థాయిలో ఇళ్లు నిర్మించలేదని విమర్శించిన మంత్రి, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, హౌసింగ్ శాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

# 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి




- టిడిపి శ్రేణులు ఐక్యంగా వైసిపిని అడ్డుకోవాలి
- టిడిపి కేడర్ సమావేశంలో లోకేశ్

విజయనగరం,ఆగస్ట్22 : టీడీపీ నియోజక వర్గ కేడర్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి ఎలా అయ్యారో తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ శ్రేణుల్లో చాలా మందిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించిన లోకేశ్.. ఎక్కడెక్కడ అక్రమ కేసులు నమోదు చేశారో వాటన్నింటినీ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు వైసీపీ ప్రయత్నాలు చేస్తోందని, అయితే టీడీపీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుంది' అని వ్యాఖ్యానించారు. మూడు పర్యాయాల పాటు టీడీపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేడర్ సమావేశం అనంతరం 2023-24 సంవత్సరంలో 'భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఉత్తమ పనితీరు కనబరిచిన 100 మంది టీడీపీ కార్యకర్తలకు నారా లోకేశ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా కేడర్‌లో మరింత ఉత్సాహంపెరుగుతుందనిఆయన పేర్కొన్నారు.

# ఫ్లోరైడ్ జిల్లాలకు వరంగా వెలిగొండ

- ఆయా ప్రాంతా ప్రలజ నీటి కష్టాలు తొలగిపోతాయి
- మంత్రి నిమ్మల రామానాయుడు



అమరావతి, ఆగస్టు 22: ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు వెలిగొండ ప్రాజెక్టు వరమని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆయా ప్రాంతాల ప్రజల నీటి కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆగస్టు 31న వెలిగొండను సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి నిమ్మల మాట్లాడారు. ఈ సందర్భంగా ఆగస్టు 31న వెలిగొండ టన్నెల్స్ నుంచి 10.5 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు సీఎం చంద్రబాబు విడుదల చేస్తారని మంత్రి నిమ్మల తెలిపారు. ప్రాజెక్టు కోసం భూములిచ్చిన త్యాగధనులకు పరిహారం ఇచ్చాకే నీళ్లు వదలాలని చంద్రబాబు చెప్పారన్నారు. ఈ మేరకు 40 రోజుల్లోనే మూడు దశల్లో రూ.760 కోట్లను వెలిగొండ నిర్వాసితులకు ఇచ్చామని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన రెండేళ్ల వ్యవధిలోనే ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు రూ.3 వేల కోట్లు పంపిణీ చేశామన్నారు. వెలిగొండలో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు. ÷లిగొండ పనులు పూర్తి కాకుండానే వైఎస్ జగన్ నాడు ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశారని నిమ్మల మండిపడ్డారు. ఈ సందర్భంగా మూడు దశాబ్దాల కలను సీఎం చంద్రబాబు నిజం చేస్తున్నారని ప్రశంసించారు. ఎల్-నినో వంటి క్లిష్ట సమయంలోనూ నల్లమల సాగర్‌కు 10.5 టీఎంసీల జలాలను తీసుకొస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో వెలిగొండ నీళ్లతో ప్రకాశం జిల్లా సస్యశ్యామలం అవుతుందని మంత్రి ఆకాంక్షించారు. కాగా, ఈరోజు వెలిగొండ నిర్వాసితులకు రూ.250 కోట్లను మూడో విడత కింద సీఎం చంద్రబాబు విడుదల చేశారు.

# అనకాపల్లికి గోదావరి నీళ్లు తెప్పిస్తాం

- వచ్చే నెలలోనే నీటిని రప్పించి చెరువులు నింపుతాం
- అనకాపల్లి పర్యటనలో సీఎం చంద్రబాబు





అమరావతి, ఆగస్టు 22: అనకాపల్లికి నీళ్లు తెచ్చే బాధ్యత తనది అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తీసుకొస్తామని.. జిల్లాలో ప్రతి చెరువు, రిజర్వాయర్లను నింపుతామని వెల్లడించారు. సెప్టెంబర్ తొలి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని పేర్కొన్నారు. 'మేం చేస్తున్న పనులను అభినందిస్తే అదే పెద్ద కిక్' అని చెప్పుకొచ్చారు. జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. అనకాపల్లి అంటే బెల్లం ఒక్కటే కాదని.. ఇండస్ట్రియల్ ఏరియా అని అన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోనే అనకాపల్లి జిల్లా నం.1 అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంచిపనులు చేస్తుంటే కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని సీఎం మండిపడ్డారు. విమర్శలు చేసేవారికి డేటా సెంటర్ అంటే తెలియదని విమర్శించారు. ఇప్పటి వరకు డేటా సెంటర్ ప్రారంభం కాలేదని, తాగడానికి నీళ్లు లేవంటూ దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డేటా సెంటర్ వస్తే లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. డేటా సెంటర్లతో ఆదాయం కూడా పెరుగుతుందని తెలిపారు. దేశంలో తొలిసారి క్వాంటం కంప్యూటర్ అమరావతికి వస్తోందన్నారు. విద్యార్థులకు ఇప్పటి నుంచేంతి టెక్నాలజీ నేర్పాలని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని జయించవచ్చారు.భివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు మాత్రమే కాదని.. పర్యావరణ పరిరక్షణ కూడా అభివృద్ధిలో భాగమే అని చంద్రబాబు అన్నారు. చెత్త నుంచి కంపోస్ట్, కరెంట్, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామం జీరో వేస్ట్ పంచాయతీగా తయారుకావాలని సూచించారు. ఆడబిడ్డల కోసం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో మూడు గ్యాస్ సిలిండర్ల డబ్బులను 4 నెలలకోసారి జమ చేస్తామన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు పెట్టుకుంటే గ్యాస్‌తో కూడా అంత పని ఉండదని అన్నారు. పార్టీ అరాచకాన్ని నమ్ముకుందని.. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీశారన్నారు. చాలాచోట్ల భూములను కబ్జా చేశారని ఆరోపించారు. వైసీపీ తప్పులను సరిదిద్దడానికి మూడేళ్లు పట్టిందన్నారు. విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ఆ÷ూఅలో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పష్టం చేశారు. ప్రజలు నిజాయితీగా ఉంటే తప్పుడు రాజకీయాలు చేసేవాళ్లు భయపడతారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

# కాళేశ్వరం నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలి




**-కన్నెపల్లి పంప్‌హౌస్ దిగువన రూ.100 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించాలి**
**-ప్రాణహిత జలాలను వృథాగా పోనివ్వొద్దు:**
**-బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

సిరిసిల్ల: కాళేశ్వరం ప్రాజెక్టును వెంటనే వినియోగంలోకి తీసుకువచ్చి ప్రాణహిత జలాలను తెలంగాణ రైతాంగానికి అందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ

ఒకప్పుడు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో పంటలను కాపాడుకున్న తెలంగాణలో ప్రస్తుతం రాత్రివేళ కరెంట్ లేక, పగలు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు .

మాజీ సీఎం కేసీఆర్ హయాంలో తుమ్మడిహట్టి–చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి తెలంగాణను సస్యశ్యామలం చేసేలా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీలోని ఎనిమిది బ్లాకుల్లో కేవలం ఏడో బ్లాక్‌లోని రెండు పిల్లర్లకు మాత్రమే సమస్య తలెత్తిందని, మిగతా బ్లాకులను వినియోగించుకునే అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలని అన్నారు .సి డబ్ల్యూ పిఆర్ఎస్ నివేదిక ప్రకారం అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితి ఎక్సలెంట్‌ఉందని, మేడిగడ్డలోని 1 నుంచి 6, 8వ బ్లాకులు సురక్షితంగా ఉన్నట్లు నివేదిక పేర్కొందని తెలిపారు. సమస్య ఉన్న భాగాన్ని మరమ్మతు చేసి ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు .ప్రాణహిత నది జలాలు వృథాగా పోతున్నాయని, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా వాటిని ఎత్తిపోసి అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు తరలించి, అక్కడి నుంచి ఎల్లంపల్లికి పంపించే అవకాశం ఉందని తెలిపారు. కన్నెపల్లి వద్ద 93.5 మీటర్ల నీటి మట్టం ఉంటే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని, కాఫర్ డ్యామ్ నిర్మించడం ద్వారా నీటి మట్టాన్ని పెంచుకోవచ్చుని పేర్కొన్నారు.ఉత్తర తెలంగాణ రైతాంగాన్ని కాపాడేందుకు కన్నెపల్లి పంప్‌హౌస్ దిగువన రూ.100 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించేందుకు ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేస్తే తెలంగాణ అభివృద్ధికి, రైతాంగానికి ప్రభుత్వం ఆటంకంగా మారుతుందని అన్నారు .కేటీఆర్ రెండు నెలల క్రితమే కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి ప్రభుత్వానికి సూచనలు చేశారని, మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా డిటైల్డ్ ప్రెజెంటేషన్ ద్వారా విషయాన్ని వివరించారని అన్నారు .కేవలం రాజకీయ కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యం చేయవద్దని,ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టాలని, లేకుంటే బీ ఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జెడ్పి చైర్మన్ అరుణ రాఘవరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల పద్మశాలీ యూత్ ఎన్నికలు హోరా హోరీ..







**హోర్డింగులతో నిండిపోయిన సిరిసిల్ల పట్టణం ఈ నెల 23న పద్మశాలీ యూత్ ఎన్నికలు ప్రచారంలో దూసుకుపోతున్న ఉద్యమ యువనేత సబ్బని హరీష్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మళ్లీ ఎన్నికల వాతవరణం చోటు చేసుకుంది. 13 ఏళ్ల అనంతరం సిరిసిల్ల పద్మశాలీ యూత్ పాలకవర్గానికి ఎన్నికల నగారా మోగింది. 13 ఏళ్ల పాటు సిరిసిల్ల పద్మశాలీ యూత్ అధ్యక్షుడిగా గుండ్లపల్లి పూర్ణచందర్ కొనసాగారు. ఆలస్యంగా ఎన్నికల నోటీఫీకేషన్ వేయగా ఈ నెల 23న సిరిసిల్ల పద్మశాలీ కళ్యాణ భవనంలో ఎన్నికలు జరగనున్నాయి. యూత్ అధ్యక్షుని పోటీలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు, సిరిసిల్ల పద్మశాలీ సమాజం లో మంచి పేరున్న సబ్బని హరీష్ తో పాటు సూరం వినయ్,స్వర్గం కిరణ్,గంగుల సాగర్ లు పోటీలో ఉన్నారు. సిరిసిల్ల పట్టణంలో పద్మశాలీ యూత్ ఓట్లు సూమారు గా 2700 ఓట్లు నమోదు కాగా 39 వార్డులకు గాను 39 డైరెక్టర్ స్థానాలకు అధ్యక్ష స్థానానికి ఒక ప్రధాన కార్యదర్శి స్థానంకు,రెండు ఉపాధ్యక్ష స్థానాలకు,ఒక కోశాధికారి ఒక సహాయ కార్యదర్శి స్థానాలకు ఈ నెల 23 ఆదివారం రోజున ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికలు హోరా హోరి..

సిరిసిల్ల పట్టణంలో పద్మశాలీ యూత్ ఎన్నికలు హోరా హోరి గా కొనసాగుతున్నాయి. సిరిసిల్ల పట్టణంలో బారిగా హోర్డింగ్ లు , మైకులతో ప్రచారం నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు వార్డుల వారిగా సమావేశాలు ఏర్పాటు చేసి యూత్ సభ్యుల ఓట్లను ఆకర్షించేలా ప్రచారాన్ని చేస్తున్నారు. ఈ ఎన్నికలు సిరిసిల్ల పట్టణంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్నాయి.

ప్రచారంతో దూసుకెళ్తున్న ఉద్యమనేత సబ్బని హరీష్

సిరిసిల్ల పట్టణంలో పద్మశాలీ యూత్ అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు సబ్బని హరీష్ ప్రచారంలో దూసుకెళ్తున్నాడు. పద్మశాలీ ప్రముఖులు, యూత్ మద్దతు బారిగా కూడగట్టుతున్నాడు. తెలంగాణ ఉద్యమంల సబ్బని హరీష్ గత పదిహేనళ్లలో పదుల సంఖ్యలో కేసులు నమోదు అయ్యాయి. విద్యార్థుల కోసం, యూత్ కోసం అనేక పోరాటాలు నిర్వహించినట్లు సిరిసిల్ల లో పేరుంది. సబ్బనీ హరీష్ కు పార్టీలకీతతంగా సిరిసిల్ల పద్మశాలీ ప్రముఖులు మద్దతు పలుకుతున్నట్లు సమాచారం. సూరం వినయ్ కు సబ్బని హరీష్ కు మధ్య పోటీ నెలకొందని సిరిసిల్ల పట్టణంలో చర్చ కొనసాగుతుంది. సూరం వినయ్ బీజేపి పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా 35 వార్డులో పోటీ చేసి ఓడిపోయారు మొన్నటి ఎన్నికల్లో. వినయ్ కు బీజేపి, కాంగ్రెస్ మద్దతు పలుకుతున్నట్లు సమాచారం.స్వర్గం కిరణ్ కు కాంగ్రెస్ మద్దతు పలుకుతున్నట్లు తెలిసింది. సబ్బని హరీష్ కు బీఆర్ఎస్ పార్టీలోని పద్మశాలీ ప్రముఖులు పరోక్షంగా మద్దతు పలుకుతున్నట్లు సమాచారం. గంగుల సాగర్ స్వతంత్రంగా బరిలో ఉన్నట్లు సమాచారం.

గెలుపు బాట లో సబ్బని హరీష్..

సిరిసిల్ల పట్టణంలో మంచి పేరున్న సబ్బని హరీష్ పద్మశాలీ సమాజంలో ప్రముఖల మద్దతు కూడగట్టడంతో యూత్ ను ఆకర్షించడంలో ముందున్నట్లు అర్థమవుతుంది. సిరిసిల్ల పట్టణంలో ఎటు చూసిన సబ్బని హరీష్ కు సంబంధించిన హోర్టింగ్ లు, ప్లెక్సీలు కనబడుతున్నాయి.కోశాధికారిగా పోటీ చేస్తున్న వంగరి చందు కూడా తన ప్రచారం కోసం లక్షలు వెచ్చిస్తున్నట్లు సమాచారం. సిరిసిల్ల పద్మశాలీ యూత్ అధ్యక్ష స్థానం కోసం పోటీ పడుతున్న అభ్యర్థులు ఒక్కక్కరు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు ప్రచారం కొనసాగుతుంది. ఏది ఏమైన సిరిసిల్ల లో పద్మశాలీ యూత్ ఎన్నికలు రాజకీయ ఎన్నికలను తలపిస్తున్నాయి.



# జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత, వనమహోత్సవం..





బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన పరిశుభ్రత, వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొని పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాల్లోని చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.అనంతరం కార్యాలయ ప్రాంగణంలో పచ్చదనం పెంపొందించేందుకు వివిధ రకాల మొక్కలను నాటారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణంగా తీర్చిదిద్దడం ద్వారా పోలీస్ సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలకు సైతం మంచి వాతావరణం కల్పించవచ్చని తెలిపారు.మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు మధుకర్, సురేష్, రమేష్, సి.ఐ లు మొగిలి, మధుకర్, ఎస్.ఐ లు కిరణ్ కుమార్, ఆర్.ఎస్.ఐ లు రాజు, శ్రవణ్ , సాయికిరణ్, దిలీప్,రాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ రూపా రెడ్డి మృతికి రెడ్డి సంక్షేమ సంఘం ఘన నివాళి..

**విద్యార్థులు చెడు మార్గాలకు దూరంగా ఉండాలి: గుండారపు కృష్ణారెడ్డి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

ఇటీవల విద్యార్థుల చేతిలో దారుణ హత్యకు గురైన ప్రిన్సిపల్ రూపా రెడ్డి గారికి రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు దైవంగా భావించే ఉపాధ్యాయురాలు దారుణ హత్యకు గురికావడం అత్యంత బాధాకరమని అన్నారు. సమాజ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, దేశ భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయసు నుంచే తమ భవిష్యత్తు గురించి ఆలోచించి, చెడు వ్యసనాలకు, చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొని ప్రిన్సిపల్ రూపా రెడ్డి గారికి ఘన నివాళులు అర్పించారు.





## గ్రామాల్లో రాత్రి వేళ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి

**-దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.**
**- ఎస్పీ మహేష్ బి. గితే**

బలగం టీవీ,గంభీరావుపేట:

గ్రామాల్లో రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేసి, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా గంబిరావుపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఎస్పీ పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి వారు ప్రదర్శించిన ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్లు పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ రాత్రి సమయాల్లో గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.డయల్–112కు అత్యవసర సమాచారం అందిన వెంటనే పెట్రోలింగ్, బ్లూకోల్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరిగేలా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు.దొంగతనాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన చోట ఆధునిక సాంకేతికతను వినియోగించి నేరాలను అరికట్టడంతో పాటు, నిందితులను త్వరితగతిన పట్టుకోవాలని ఆదేశించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.ఇక్కడ డిఎస్పీ నాగేంద్రచారి, సిఐ వెంకటేష్, ఎస్ఐ శ్రీకాంత్ , సిబ్బంది ఉన్నారు.



## విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలి

**-రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

విద్యార్థులు చిన్న వయసు నుంచే భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించి, వ్యసనాలు, చెడు మార్గాలకు దూరంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు..కోత్వాల్ రాజా బహదూర్ వెంకటరామారెడ్డి 157వ జయంతి సందర్భంగా శనివారం రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం కోర్ కమిటీ సభ్యుడు న్యాలకొండ రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, గుల్లపల్లి నరసింహారెడ్డి, కోశాధికారి ఎద్మల హనుమంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కంకణాల శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు ఉప్పల లక్ష్మారెడ్డి, అక్కపెల్లి రాజనర్సింహారెడ్డి, బద్దం నాగిరెడ్డి, అక్కపెల్లి నవీన్‌రెడ్డి, దుంద్ర ఆదిరెడ్డి, పుట్ట నారాయణరెడ్డి, బైరి శ్రీహరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎస్ఐలకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తంగళ్లపల్లి ఎస్ఐ అశోక్, ఇల్లంతకుంట ఎస్ఐ ఉపేంద్ర చారి, వేములవాడ రూరల్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, కొనరావుపేట ఎస్ఐ రామ్మోహన్‌లు శనివారం ఆయా పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ మహేష్ బి. గితేను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరిస్తూ, పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని నూతన ఎస్ఐలకు ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు.



## జోగినిపల్లి శ్రీనివాస్ రావుకు ఘనంగా శ్రద్ధాంజలి..

బలగం టీవీ, బోయినిపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామానికి తన వంతుగా ఎన్నో సహాయ సహకారాలు అందిస్తూ, గ్రామ ప్రజలతో ఎనలేని ప్రేమానురాగాలు పంచుకున్న బిఆర్ఎస్ నాయకులు జోగినిపల్లి శ్రీనివాస్ రావు 10వ రోజు సందర్భంగా ఈరోజు ఉదయం తడగొండ గ్రామ బస్టాండ్ ఆవరణలో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ: శ్రీనివాస్ రావు ఎప్పుడు తడగొండ గ్రామానికి వచ్చినా ప్రజల కోరిక మేరకు తన వంతుగా సహాయ సహకారాలు అందించేవారని, కులమతాలకు అతీతంగా చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేసుకున్నారు.గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం, సాయిబాబా ఆలయం, పోచమ్మ ఆలయం, ఎల్లమ్మ ఆలయం, మసీదు, అలగే గ్రామంలో సీసీ కెమెరాలకు కానీ తదితర కార్యక్రమాలకు తన వంతుగా సహాయం చేసి, తన గొప్ప మనసును చాటుకున్నారని తెలిపారు.హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ ఆయన మనసంతా తడగొండ గ్రామంపైనే ఉండేదని, గ్రామ ప్రజలు గుర్తు చేసుకున్నారు. ఇటీవల కొదురుపాక గ్రామానికి వచ్చిన సందర్భంగా కేటీఆర్ ని కలిసి,“అల్లుడు… నాకు తడగొండ గ్రామం అంటే ఎంతో ప్రేమ. నాకు ఒక్కటే కోరిక.. తడగొండ గ్రామానికి ఒక ఫంక్షన్ హాల్ కట్టించాలని ఉంది. అందుకు మీ సహాయం కావాలి” అని శ్రీనివాస్ రావు కోరిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అందుకు కేటీఆర్ స్పందిస్తూ “అలాగే మామయ్య.. మన ప్రభుత్వం రాగానే చేద్దాం” అని హామీ ఇచ్చిన విషయాన్ని గ్రామ ప్రజలు తెలిపారు.ఇలా చెప్పుకుంటూ పోతే శ్రీనివాస్ రావు తడగొండ గ్రామానికి చేసిన సేవలు, అందించిన సహాయ సహకారాలు ఎన్నో ఉన్నాయని, అలాంటి గొప్ప మనిషి మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమని గ్రామ ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. జోగినిపల్లి శ్రీనివాస్ రావు సేవలు, ఆప్యాయతలు తడగొండ గ్రామ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ చిందం రమేష్, గూడూరి సురేందర్ రావు, కమల్ గౌడ్,గ్రామ పంచాయతీ వర్డ్ మెంబెర్స్ వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కెనడియన్ ఉత్పత్తులపై అమెరికా 50% పన్నులు

- ప్రతిచర్యగా సమాన స్థాయిలో సుంకాలు వేస్తా- మన్న కెనడా ప్రధాని మార్క్ కార్నీ
- క్షీణించిన ఇరుదేశాల వాణిజ్య సంబంధాలు.. చర్చల ప్రక్రియ రద్దు

బలగం టీవీ, వాషింగ్టన్/ఒట్టావా

ప్రపంచంలో అత్యంత సన్నిహిత మిత్రదేశాలుగా ఉన్న అమెరికా, కెనడాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. శనివారం తెల్లవారుజామున కెనడాకు చెందిన 20 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులపై అమెరికా ఏకంగా 50 శాతం అదనపు సుంకాలను (టారిఫ్‌లను) విధించింది. చివరి నిమిషం వరకు సాగిన వాణిజ్య చర్చలు ఘోరంగా విఫలం కావడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలులోకి తీసుకొచ్చింది.

రూపాయికి రూపాయి పన్ను సమాధానం: కెనడా ప్రధాని

అమెరికా విధించిన భారీ సుంకాలను ఎంతమాత్రం సహించేది లేదని కెనడా ప్రధాని మార్క్ కార్నీ స్పష్టం చేశారు. తమ దేశ కార్మికులు, వ్యాపారుల ప్రయోజనాలను కాపాడుకోవడానికి "డాలర్‌కు డాలర్" (సమాన స్థాయిలో) అమెరికా ఉత్పత్తులపై రిటాలియేటరీ టారిఫ్‌లు విధిస్తామని ఆయన ప్రకటించారు. "అమెరికా ప్రతిపాదించిన ఒప్పంద నిబంధనలు తీవ్ర అన్యాయంగా, ఆర్థికంగా భారంగా ఉన్నాయి. ఒక చెడు ఒప్పందాన్ని ఒప్పుకోవడం కంటే చర్చల నుంచి బయటకు రావడమే మంచిదని నిర్ణయించుకున్నాం" అని కార్నీ వెల్లడించారు.

చర్చలు విఫలం.. మిగిలిన ఒప్పందాలన్నీ ప్రమాదంలో

అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమీసన్ గ్రీర్ మాట్లాడుతూ..



కెనడా కొత్త డిమాండ్లు తీసుకురావడం వల్లనే ఒప్పందం ఖరారు కాలేదని ఆరోపించారు. స్టీల్, అల్యూమినియం, ఆటోమొబైల్స్ రంగాలు ఎదుర్కొంటున్న సుంకాల నుంచి సడలింపు కావాలని కెనడా గట్టిగా కోరగా అమెరికా నిరాకరించింది. ఈ పరిణామంతో అమెరికా, కెనడా, మెక్సికో మధ్య ఉన్న కీలక ఉత్తర అమెరికా ఉమ్మడి వాణిజ్య ఒప్పందం (USMCA) భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారింది.

1930 నాటి డిప్రెషన్ చట్టం అమలు

ట్రంప్ ప్రభుత్వం కెనడాను దెబ్బతీయడానికి 1930 నాటి 'టారిఫ్ యాక్ట్' లోని సెక్షన్ 338ను ఉపయోగించింది. కెనడా ఎగుమతి చేసే హాకీ స్టిక్స్ నుండి వైద్య పరికరాల వరకు దాదాపు 5 శాతం ఉత్పత్తులపై ఈ పన్నులు పడనున్నాయి. దశాబ్దాలుగా స్నేహపూర్వకంగా ఉన్న ఇరుదేశాల సరిహద్దుల్లో ప్రస్తుతం నెలకొన్న ఈ ఆర్థిక ఉద్రిక్తతలు అంతర్జాతీయ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## ఆగస్టు 28నే రాఖీ పండుగ.. పండితుల స్పష్టత..

### -శ్రావణ పౌర్ణమి తిథి ఆగస్టు 27 ఉదయం ప్రారంభం – 28 ఉదయం వరకు కొనసాగింపు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

శ్రావణ పౌర్ణమి తిథి ఆగస్టు 27 ఉదయం 9:08 గంటలకు ప్రారంభమై, ఆగస్టు 28 ఉదయం 9:48 గంటల వరకు కొనసాగనుంది. దీంతో ఈ ఏడాది రాఖీ పండుగను ఆగస్టు 28న జరుపుకోవాలని పండితులు స్పష్టం చేశారు.

రాఖీ కట్టేందుకు ఆగస్టు 28న ఉదయం 6:23 గంటల నుంచి 9:48 గంటల వరకు సమయం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12:14 గంటల నుంచి 1:05 గంటల వరకు అభిజిత్ ముహూర్తం శుభప్రదమని పేర్కొన్నారు. భద్ర కాలం సూర్యోదయానికి ముందే ముగియనున్నందున ఆగస్టు 28న రోజంతా రాఖీ కట్టుకోవడానికి అనుకూలంగా ఉంటుందని పండితులు వెల్లడించారు. శ్రావణ పౌర్ణమి తిథి 28వ తేదీ ఉదయం 9:48 గంటలకు ముగుస్తున్న నేపథ్యంలో రక్షాబంధన్‌ను అదే రోజు నిర్వహించడం శాస్త్రోక్తమని స్పష్టం చేశారు. అందువల్ల రాఖీ పండుగ తేదీపై నెలకొన్న సందేహాలకు తెరపడిందని, ఈ ఏడాది ఆగస్టు 28న రక్షాబంధన్ వేడుకలు నిర్వహించుకోవచ్చని పండితులు తెలిపారు.



## వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చు

### జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ కుమార్

బలగం టీవీ, బోయినపల్లి

వాణిజ్య పంటల సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు మెరుగైన లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్‌కుమార్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వాణిజ్య పంటలను ఉద్యానవన శాఖ అధికారులు శనివారం రోజున పరిశీలించారు.రత్నంపేట గ్రామంలో విజయ,సత్యం దంపతులు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, రామన్నపేట గ్రామంలో మిట్టపల్లి కమలాకర్‌రెడ్డి సాగు చేస్తున్న బూడిద గుమ్మడి, రాస గుమ్మడి పంటలను అధికారులు పరిశీలించారు. అనంతరం దేశాయిపల్లి గ్రామంలో ఒంటెల వీరారెడ్డి సాగు చేస్తున్న టమాట, మునగ పంటలను, మర్లపేట గ్రామంలో భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి నూతనంగా పెట్టిన ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్‌కుమార్, వ్యవసాయ అధికారి ప్రణీత రైతులతో పంటల సాగు విధానాలపై చర్చించారు. శరత్‌కుమార్ మరియు ప్రణీత మాట్లాడుతూ: అధిక దిగుబడులు సాధించేందుకు నాణ్యమైన విత్తనాలు, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, తెగుళ్లు–కీటకాల నివారణ చర్యలను సకాలంలో చేపట్టాలని సూచించారు. పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు పాటించాలని రైతులకు తెలిపారు.వాణిజ్య పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నందున శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించి రైతులు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించేందుకు ఉద్యానవన శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.



## పీఏసీఎస్ చైర్మన్ ను సన్మానించిన రెడ్డి సంఘం సభ్యులు

బలగం టీవీ, ఇల్లంతకుంట

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పి ఏ సి ఎస్ చైర్మన్ ఉట్కూరి వెంకటరమణ రెడ్డి నీ శనివారం రోజు ఇల్లంతకుంట రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు సంగభవనంలో ఘనంగ సన్మానించారు చైర్మంతో పాటు డైరెక్టర్లను సన్మానించారు ఈ సందర్భంగా చైర్మన్ వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఏం ఎల్ ఏ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేసారు తను నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు తనను సన్మానించిన రెడ్డి కులబంధవులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సంగబివృద్ధికి కృషిచేస్తానన్నారు ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సిరిసిల్ల కార్యవర్గ సభ్యులు కంకణాలు శ్రీనివాసరెడ్డి ఇల్లంతకుంట రెడ్డి సంఘం అధ్యక్షుడు గడ్డం రవీందర్ రెడ్డి చిట్టి కృష్ణారెడ్డి కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి కంది శ్రీనివాస్ రెడ్డి కంది రాజిరెడ్డి కట్ట నరసింహ రెడ్డి సింగిరెడ్డి ఎల్లారెడ్డి రాంప్రసాద్ రెడ్డి మహేందర్ రెడ్డి వివిధ గ్రామాల రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు



## అమెరికాలో $7.5 మిలియన్ల వృద్ధుల మోసం కేసులో భారతీయుడి అరెస్ట్

బలగం టీవీ, వాషింగ్టన్

అమెరికాలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని రూ. 63 కోట్లకు పైగా ($7.55 మిలియన్ల) ఆర్థిక మోసానికి పాల్పడిన కేసులో 21 ఏళ్ల గుజరాత్ మూలాలున్న భారతీయ పౌరుడు జై సునీల్‌భార్తి గోస్వామిని అధికారులు U.S. Department of Justice అదుపులోకి తీసుకున్నారు. న్యూజెర్సీలోని జెర్సీ సిటీలో నివసిస్తున్న ఇతడు, అమెరికాలో బెయిల్‌పై బయటకు వచ్చి కెనడా మీదుగా ఖతార్ పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా టొరంటో పీర్సన్ విమానాశ్రయంలో పట్టుబడ్డాడు.

కేసు నేపథ్యం & మోసం జరిగిన తీరు

మనీ మ్యూల్ (Money Mule): అమెరికాలోని IRS నేర పరిశోధనా విభాగం తెలపిన వివరాల ప్రకారం, ఈ నెట్‌వర్క్ అమెరికా వ్యాప్తంగా ఉన్న వృద్ధులకు (59 నుండి 87 సంవత్సరాల వయస్సు గలవారికి) ఫోన్లు చేసి, వారి బ్యాంక్ ఖాతాలు ప్రమాదంలో ఉన్నాయని భయపెట్టేవారు.

బంగారం, నగదు వసూలు: బాధితుల ఖాతాలలోని డబ్బును బంగారం, నగదు లేదా గిఫ్ట్ కార్డులుగా మార్చాలని నమ్మించి, పిమ్మట అధికారులుగా నటించి వారి వద్ద నుండి డబ్బు వసూలు చేసేవారు. గోస్వామి నేరుగా బాధితుల ఇళ్లకు వెళ్లి బంగారం, నగదు సేకరించే 'మనీ మ్యూల్'గా వ్యవహరించాడని The Economic Times పేర్కొంది.

కమీషన్: బాధితుల నుండి వసూలు చేసిన మొత్తంలో తనకు వచ్చిన కమిషన్ కింద దాదాపు $90,000 నగదును గోస్వామి తన బ్యాంక్ ఆఫ్ అమెరికా ఖాతాలో డిపాజిట్ చేసినట్లు అధికారులు గుర్తించారు.

పారిపోయే ప్రయత్నం & అరెస్ట్

ఆగస్టు 17న అమెరికా కోర్టు ముందు హాజరైన గోస్వామికి కొన్ని నిబంధనలతో ముందస్తు బెయిల్ లభించింది. అయితే మరుసటి రోజే (ఆగస్టు 18) పీస్ బ్రిడ్జ్ గుండా కెనడాలోకి ప్రవేశించి, టొరంటో నుండి దోహా (ఖతార్) వెళ్లే విమానం టికెట్ బుక్ చేసుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న కెనడా అధికారులు అతడిని విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు.

ప్రస్తుతం US Marshals Service మరియు అమెరికా న్యాయ శాఖ అతడిని అమెరికాకు అప్పగించే (Extradition) ప్రక్రియను ప్రారంభించాయి. వైర్ ఫ్రాడ్, మనీ లాండరింగ్ నేరాలు రుజువైతే ఇతనికి 20 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని The Times of India వెల్లడించింది.

## "ఇరాన్ ఒప్పందానికి సిద్ధంగా ఉంది.. కానీ సరైన షరతులకు కాదు": డొనాల్డ్ ట్రంప్



### అమెరికా ఆంక్షలు మళ్లీ విఫలమవ్వడం ఖాయం

### ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి

బలగం టీవీ, వాషింగ్టన్

అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పంద చర్చలు మరింత సంక్షోభంలోకి వెళ్లాయి. ఇరాన్‌పై ఆర్థిక అష్టదిగ్బంధనం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యలు పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలను పెంచాయి. దక్షిణాఫ్రికా/కెరోలినా పర్యటనకు బయలుదేరే ముందు మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలని ఆశిస్తున్నప్పటికీ, అమెరికా కోరుకుంటున్న నిబంధనలకు ఒప్పుకునే స్థితిలో లేదని వ్యాఖ్యానించారు.

ట్రంప్ విమర్శలు - పశ్చిమాసియాపై ఆధిపత్యం

ఇరాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, దేశంలో ద్రవ్యోల్బణం 350 శాతానికి చేరిందని ట్రంప్ ఆరోపించారు.

సైనిక బలహీనత: ఇరాన్ తన సైనిక, పోలీసు బలగాలకు జీతాలు కూడా చెల్లించలేకపోతోందని, నావికా, వైమానిక దళాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు.

హర్మూజ్ జలసంధి నియంత్రణ: హర్మూజ్ జలసంధితో పాటు ప్రాంతీయ సరిహద్దులపై అమెరికాకే పూర్తి ఆధిపత్యం ఉందన్న సంకేతాలు ఇచ్చారు.

ఆర్థిక దెబ్బ: ఇరాన్ చమురు స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లు, ఎక్స్ఛేంజ్ హౌస్‌లు, ఫ్రంట్ కంపెనీలను లక్ష్యంగా చేసుకుని 'ఎకనామిక్ డి-డే' పేరిట ఆర్థిక ఆంక్షలు కఠినతరం చేస్తున్నట్లు ప్రకటించారు. టెహ్రాన్‌కు మద్దతు ఇచ్చే ఇతర దేశాలు కూడా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు.

ఇరాన్ ఘాటు ప్రత్యుత్తరం: 'ఇది ఆర్థిక ఉగ్రవాదం'

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి తీవ్ర స్థాయిలో స్పందించారు. అమెరికా ఆర్థిక ఆంక్షల విధానం ముమ్మాటికీ విఫలమవుతుందని సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి తేల్చిచెప్పారు.

గత చరిత్రను గుర్తు చేస్తూ: "14 ఏళ్ల క్రితం కఠిన ఆంక్షలన్నారు.. విఫలమయ్యారు. 8 ఏళ్ల క్రితం గరిష్ఠ ఒత్తిడి అన్నారు.. అదీ ఫెయిల్ అయింది. 5 నెలల క్రితం లొంగిపోవాలన్నారు.. అదీ కుదరలేదు. ఇప్పుడు అతిపెద్ద ఆర్థిక ఆపరేషన్ అంటున్నారు.. ఇది కూడా కచ్చితంగా విఫలమవుతుంది" అని అరాఘ్చి ఎద్దేవా చేశారు.

స్వంత సంక్షోభాల నుంచి మళ్లింపు: అమెరికాలోని పెరుగుతున్న అప్పులు, ఆర్థిక లోపాల నుంచి సొంత ప్రజల దృష్టిని మళ్లించేందుకే ట్రంప్ ఇలాంటి నాటకీయ ప్రకటనలు చేస్తున్నారని అరాఘ్చి విమర్శించారు.

అటు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘర్ గాలిబఫ్ స్పందిస్తూ.. 14 పాయింట్ల అవగాహనా ఒప్పందంలోని షరతులను అమెరికా అమలు చేసి, చమురు ఆంక్షలు ఎత్తివేసే వరకు హర్మూజ్ జలసంధి విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

## గాంధీజీ లేఖలు, మాన్యుస్క్రిప్టుల వేలంపై నేషనల్ గాంధీ మ్యూజియం ఆవేదన

### జాతీయ వారసత్వ సంపదను వేలం వేయొద్దు.. మ్యూజియంకు అప్పగించండి

బలగం టీవీ, న్యూఢిల్లీ

మహాత్మా గాంధీకి సంబంధించిన లేఖలు, చేతిరాత ప్రతులు, వ్యక్తిగత వస్తువులను వేలం వేయడంపై నేషనల్ గాంధీ మ్యూజియం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఇవి వ్యక్తిగత ఆస్తులు మాత్రమే కాదని, భారతదేశ ఉమ్మడి వారసత్వ సంపదలో భాగమని మ్యూజియం డైరెక్టర్ ఎ. అన్నామలై పేర్కొన్నారు.

ఆగస్టు 19న నిర్వహించిన వేలంలో గాంధీజీకి సంబంధించిన 86 వస్తువులు విక్రయమయ్యాయి. ఆయన సన్నిహిత సహచరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఆనంద్ టీ. హింగోరాణికి రాసిన 688 చేతిరాత సందేశాల సంకలనం 'ఎ థాట్ ఫర్ ది డే' రూ.16.20 కోట్లకు అమ్ముడై, వేలంలో విక్రయమైన భారతీయ చారిత్రక పత్రాల్లో ప్రపంచ రికార్డు సృష్టించింది.

ఈ ఘటన తీవ్రంగా బాధించిందని అన్నామలై తెలిపారు. గాంధీజీ లేఖలు, మాన్యుస్క్రిప్టులు, ఆయన ఉపయోగించిన వస్తువులను భద్రపరచడం చారిత్రక బాధ్యత అన్నారు. వాటిని కలిగి ఉన్నవారు వేలం వేయకుండా న్యూఢిల్లీలోని నేషనల్ గాంధీ మ్యూజియంకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

వేలంలో గాంధీజీ దేవుడు, భగవద్గీతపై రాసిన ప్రతులు రూ.1.68 కోట్లకు, ఆయన ఉపయోగించిన 'పెట్టి చర్కా'తోపాటు రెండు లేఖలు రూ.1.02 కోట్లకు విక్రయమయ్యాయి.



## భారత్‌లోని శ్రీలంక శరణార్థుల పునరాగమనానికి ఐరాస స్వాగతం

### స్వచ్ఛందంగా స్వదేశానికి చేరేందుకు ప్రక్రియల సరళీకరణ

బలగం టీవీ, న్యూఢిల్లీ

భారత్‌లో ఉంటున్న శ్రీలంక శరణార్థులు స్వచ్ఛందంగా స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు వలస ప్రక్రియలను సరళీకరించాలన్న శ్రీలంక ప్రభుత్వ నిర్ణయాన్ని ఐక్యరాజ్యసమితి స్వాగతించింది. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా దేశం విడిచిన శరణార్థుల పునరాగమనాన్ని వేగవంతం చేసేందుకు శ్రీలంక ప్రభుత్వం ఈ నెలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

1983లో శ్రీలంకలో ప్రారంభమైన జాతి ఘర్షణలు, అనంతరం ఎల్‌టీటీఈతో దాదాపు మూడు దశాబ్దాలపాటు సాగిన సాయుధ పోరాటం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు తమిళనాడుకు వలస వచ్చారు. 2002 నుంచి 2022 మధ్య సుమారు 18 వేల మంది స్వదేశానికి తిరిగి వెళ్లగా, మరో 90 వేల మంది ఇప్పటికీ తమిళనాడులోనే ఉన్నట్లు సమాచారం.

చాలామంది దశాబ్దాలుగా భారత్‌లో నివసిస్తున్నందున ఉపాధి, పత్రాలు, దీర్ఘకాలిక న్యాయపరమైన స్థితి వంటి అంశాలు వారి పునరావాసానికి సవాళ్లుగా ఉన్నాయి.

శ్రీలంకలో ఐరాస ప్రతినిధి మార్క్-ఆంద్రే ఫ్రాంచ్ మాట్లాడుతూ శరణార్థుల సురక్షిత, గౌరవప్రదమైన పునరాగమనానికి ఐరాస శరణార్థుల సంస్థ (యూఎన్‌హెచ్‌సీఆర్) ద్వారా సహకారం కొనసాగిస్తామని తెలిపారు.

## పిల్లల గోప్యత కేసులో టిక్‌టాక్‌కు భారీ జరిమానా

### అమెరికా న్యాయ శాఖతో రూ.400 మిలియన్ డాలర్లకు ఒప్పందం

బలగం టీవీ, న్యూఢిల్లీ

పిల్లల గోప్యతకు సంబంధించిన కేసులో టిక్‌టాక్ అమెరికా న్యాయ శాఖతో 400 మిలియన్ డాలర్ల పరిహార ఒప్పందానికి వచ్చింది. 2024లో దాఖలైన కేసును ముగించేందుకు ఈ ఒప్పందం కుదిరింది. టిక్‌టాక్ వెంటనే 300 మిలియన్ డాలర్లు చెల్లించనుండగా, మరో 100 మిలియన్ డాలర్లు గతంలో దాని పూర్వ సంస్థ మ్యూజికల్.లైపై ఉన్న ఆదేశాన్ని తొలగించిన అనంతరం చెల్లించనుంది.

13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించేందుకు తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరిగా ఉండాలన్న ఫెడరల్ చట్టాన్ని టిక్‌టాక్, దాని చైనా మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ ఉల్లంఘించాయని అమెరికా న్యాయ శాఖ ఆరోపించింది. పిల్లల ఖాతాలను తొలగించాలని తల్లిదండ్రులు కోరినప్పటికీ సంస్థలు స్పందించలేదని పేర్కొంది.

ఈ ఒప్పందం అమెరికా పిల్లలు, తల్లిదండ్రులకు పెద్ద విజయమని అమెరికా అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ ఈ. వుడ్‌వర్డ్ జూనియర్ తెలిపారు. పిల్లల ఆన్‌లైన్ భద్రత, వ్యక్తిగత సమాచార పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

ఇదిలా ఉండగా, పిల్లల భద్రత, గోప్యతపై సోషల్ మీడియా సంస్థలపై పలు దేశాల్లో కేసులు, ఆంక్షలు పెరుగుతున్నాయి.

## చందమామపై నీటి మంచు వేట: చైనా 'ఛాంగే-7' ప్రయోగం!



### నాసా వ్యూహాలకు భిన్నంగా చైనా ప్రతిష్టాత్మక ల్యూనార్ మిషన్

### వెలుతురు సోకని చీకటి క్రేటర్లలోకి ల్యాండ్ కానున్న 'హోపర్' వ్యోమనౌక

బలగం టీవీ, న్యూఢిల్లీ

జాబిల్లిపై నీటి మంచు జాడను, దాని నిల్వల లభ్యతను శోధించేందుకు చైనా స్పేస్ ప్రోగ్రామ్ అత్యంత వినూత్నమైన ఛాంగే-7 (Chang'e-7) మిషన్‌కు సిద్ధమవుతోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని వెలుతురు ఎప్పటికీ ప్రసరించని లోతైన గుంతల్లో (Permanently Shadowed Craters) పరిశోధనలు చేయడం ఈ మిషన్ ముఖ్య ఉద్దేశం.

ఛాంగే-7 మిషన్ ప్రత్యేకతలు

చంద్రుడిపై శతాబ్దాలుగా సూర్యకాంతి పడని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 200 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉంటాయి. ఇలాంటి క్లిష్టమైన ప్రాంతాలలో పరిశోధనలు చేసేందుకు చైనా ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించింది:

మల్టీ-ఫంక్షనల్ వ్యవస్థ: ఈ మిషన్‌లో ఒక ఆర్బిటర్, ల్యాండర్, రోవర్లతో పాటు ప్రత్యేకమైన 'హోపర్' (Hopper) అనే లీపింగ్ వెహికల్ ఉండనుంది.

హోపర్ పరికరం: చక్రాలు ఉన్న రోవర్లు ప్రయాణించలేని అత్యంత దిగువ ప్రాంతాలకు, కఠినమైన క్రేటర్లలోకి ఈ 'హోపర్' ఎగిరి దూకి (Leap) ప్రవేశించగలదు.

కమ్యూనికేషన్ సిస్టమ్: గతంలో ప్రయోగించిన 'క్యుకియావో-2' (Queqiao-2) ఉపగ్రహం ద్వారా సమాచార మార్పిడి జరగనుంది.

నాసా వ్యూహానికి.. చైనా ప్రయోగానికి తేడా

ఈ అన్వేషణలో అమెరికా అంతరిక్ష సంస్థ నాసా (NASA) మరియు చైనాలు వేర్వేరు మార్గాలను ఎంచుకున్నాయి:

చైనా మోడల్: ప్రభుత్వ నియంత్రణలోని ఒకే సమగ్ర ప్రాజెక్టు ద్వారా స్పష్టమైన ఒక లక్ష్యంతో ఛాంగే-7ను రూపొందించారు.

నాసా వాణిజ్య విధానం: నాసా 'కమర్షియల్ ల్యూనార్ పేలోడ్ సర్వీసెస్' (CLPS) ద్వారా ప్రైవేట్ కంపెనీల సేవలపై ఆధారపడుతోంది. ఆర్టెమిస్ (Artemis) ప్రాజెక్ట్ ద్వారా చంద్రుడిపై శాశ్వత మానవ ఉనికిని చాటాలని నాసా భావిస్తోంది.

భవిష్యత్తు ప్రణాళికలు

2028లో ప్రయోగించబోయే ఛాంగే-8 ద్వారా లభ్యమయ్యే వనరులను ఎలా ఉపయోగించుకోవచ్చో ప్రదర్శించనున్నారు. తదనంతరం రష్యా వ్యోమగామి సంస్థ 'రోస్ కాస్మోస్'తో కలిసి చైనా 'ఇంటర్నేషనల్ ల్యూనార్ రీసెర్చ్ స్టేషన్'ను నిర్మించే దిశగా ప్రణాళికలు రచిస్తోంది.

# భాగ్యనగరంలో 'టెన్నిస్ ప్రీమియర్ లీగ్'

**డిసెంబర్ 8 నుండి 13 వరకు ఎల్బీ స్టేడియంలో మ్యాచ్‌లు**

**తెలంగాణ ప్రభుత్వ మద్దతుతో తొలిసారి నగరంలో ప్రతిష్టాత్మక టోర్నీ**

బలగం టీవీ, హైదరాబాద్

దేశంలో అత్యంత ఆదరణ పొందిన టెన్నిస్ లీగ్ 'టెన్నిస్ ప్రీమియర్ లీగ్' (TPL) 8వ సీజన్‌కు నగరంలోని చారిత్రక ఎల్బీ స్టేడియం వేదిక కానుంది. ఈ ప్రతిష్టాత్మక లీగ్‌ను ఈ ఏడాది డిసెంబర్ 8 నుండి 13 వరకు తెలంగాణ ప్రభుత్వ సహకారంతో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. గత ఏడో సీజన్ అహ్మదాబాద్‌లో విజయవంతంగా జరగగా, ఈసారి తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహిస్తుండటం విశేషం.

8 ఫ్రాంచైజీలు.. 25 పాయింట్ల ఫార్మాట్

ఈ టోర్నమెంట్‌లో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు పోటీపడనున్నాయి. హైదరాబాద్ స్ట్రయికర్స్‌తో పాటు జీఎస్ ఢిల్లీ ఏసెస్, లక్నో బ్లేజర్స్, గుర్గావ్ గ్రాండ్‌స్లామర్స్, గుజరాత్ పాంథర్స్, రాజస్థాన్ రేంజర్స్, కోల్‌కతా థండర్ బ్లేడ్స్, ముంబై రాయల్స్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. లీగ్ సిగ్నేచర్ అయిన 25 పాయింట్ల ఫార్మాట్‌లోనే ఈ మ్యాచ్‌లన్నీ సాగుతాయి.



'కియా ఇండియా'తో భాగస్వామ్యం

"హైదరాబాద్‌లోని అద్భుతమైన క్రీడా సంస్కృతి టీపీఎల్ ప్రయాణంలో తదుపరి మైలురాయికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ఎనిమిదో సీజన్‌లో 'కియా ఇండియా' టైటిల్ భాగస్వామిగా వ్యవహరించడం విశేషం" అని టీపీఎల్ సహ వ్యవస్థాపకుడు కునాల్ ఠక్కర్ తెలిపారు. ఈ లీగ్‌కు భారత్ తరఫున దిగ్గజ క్రీడాకారులు లియాండర్ పేస్, సానియా మీర్జాతో పాటు సినీ ప్రముఖులు రాకుల్ ప్రీత్ సింగ్, సోనాలి బింద్రే బ్రాండ్ అంబాసిడర్లుగా, జట్టు యజమానులుగా హాజరుకానున్నారు.

# 'ర్యాంకులు ముఖ్యం కాదు.. ట్రోఫీలే ముఖ్యం'



**టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్!**

**మూడు టెస్టుల సిరీస్‌లే ఉత్తమం**

**టెస్టుల్లో జట్టు పతనం కావడం లేదని స్పష్టీకరణ**

**శ్రీలంకతో రెండో టెస్టుకు ముందు హెడ్ కోచ్**

బలగం టీవీ, హైదరాబాద్

టెస్ట్ క్రికెట్‌లో భారత జట్టు తీవ్రంగా ఇబ్బంది పడుతోందన్న వార్తలను టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పూర్తిగా తోసిపుచ్చాడు. ఇటీవల ఎదురైన ఓటములను జట్టు పతనానికి సూచికగా కాకుండా, జట్టు పరివర్తన (ట్రాన్సిషన్) దశలో ఉందనే కోణంలోనే చూడాలని స్పష్టం చేశాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో భారత్ 165 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి 1-0తో ఆధిక్యంలో నిలవగా, ఆదివారం నుంచి కొలంబోలో రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌కు ముందు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంభీర్ మాట్లాడాడు.

వ్యక్తిగత ప్రదర్శనల కంటే ట్రోఫీలకే ప్రాధాన్యం

కోచ్‌గా జట్టుకు ట్రోఫీలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని గంభీర్ తేల్చిచెప్పాడు. "నా దృష్టిలో ర్యాంకింగ్స్ లేదా ఆటగాళ్ల ఐసీసీ ర్యాంకులు ముఖ్యమైనవి కావు. జట్టు ట్రోఫీలను గెలవగలుగుతోందా లేదా అనేదే ముఖ్యం. హెడ్ కోచ్‌గా నా పని జట్టు చేత ట్రోఫీలు గెలిపించడమే, నేను నమ్మే సిద్ధాంతం కూడా అదే. దీనిపై ఇతరుల అభిప్రాయాలు, ఇష్టాయిష్టాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు" అని గంభీర్ స్పష్టం చేశాడు.

20 వికెట్లు తీసే కాంబినేషన్‌కే ప్రాధాన్యం

తుది జట్టు ఎంపికపై స్పందిస్తూ, ప్రత్యర్థి జట్టు 20 వికెట్లు తీయగల బౌలింగ్ విభాగంపైనే జట్టు ఎంపిక ఆధారపడి ఉంటుందని తెలిపాడు. కుల్దీప్ యాదవ్ అత్యుత్తమ బౌలర్ అయినప్పటికీ, జట్టు సమతూకం మరియు కెప్టెన్ ఆలోచనలకు అనుగుణంగా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నాడు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శనను బట్టి ఆటగాళ్లను పక్కన పెట్టే సంస్కృతి తన విధానం కాదని, ప్లేయర్లకు తగినన్ని అవకాశాలు ఇచ్చి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నాడు.

మూడు టెస్టుల సిరీస్‌లే ఉత్తమం

రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ల కంటే మూడు మ్యాచ్‌ల సిరీస్‌లు నిర్వహించడమే ఉత్తమమైన పద్ధతి అని గంభీర్ అభిప్రాయపడ్డాడు. తొలి మ్యాచ్ ఓడిపోయినా పుంజుకుని సిరీస్ గెలిచేందుకు మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో అవకాశం ఉంటుందని చెప్పాడు. గాలే పిచ్ టెస్ట్ క్రికెట్‌కు ఎంతో అనుకూలంగా ఉండి ఆకట్టుకుందని, కొలంబో వికెట్ కూడా అలాగే ఉంటుందని ఆశిస్తున్నట్లు వ్యాఖ్యానించాడు.

# బంగ్లాదేశ్‌పై ఆసీస్ ఆధిపత్యం

**తొలి రోజే పడిన 18 వికెట్లు!**

**మిచెల్ స్టార్క్, షోరిఫుల్ ఇస్లామ్ ఆరు వికెట్ల ధమాకా**

**తొలి ఇన్నింగ్స్‌లో 101 పరుగుల ఆధిక్యంలో ఆస్ట్రేలియా**

బలగం టీవీ, హైదరాబాద్

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజే పేసర్ల ధాటికి వికెట్ల పతనం కొనసాగింది. శనివారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల వేగవంతమైన బౌలర్లు విజృంభించడంతో మొదటి రోజు ఆటలోనే ఏకంగా 18 వికెట్లు నేలకూలాయి. ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ (81 బంతుల్లో 51 బ్యాటింగ్) సాధికారిక అర్ధశతకంతో పోరాడటంతో, తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తన మొదటి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసి 101 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

64 పరుగులకే కుప్పకూలిన బంగ్లాదేశ్

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు ఆస్ట్రేలియా పేస్ ధాటికి కేవలం 34 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. సీనియర్ పేసర్ మిచెల్ స్టార్క్ (6/12) ఆరు వికెట్లతో చెలరేగి బంగ్లా ఇన్నింగ్స్‌ను దెబ్బతీశాడు. అతనికి తోడుగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ 3 వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్ బ్యాటర్లలో తొలి టెస్టు సెంచరీ హీరో తాంజిద్ హసన్‌తో పాటు మరో ముగ్గురు డకౌటయ్యారు. ఆఖరి వికెట్‌కు షోరిఫుల్ ఇస్లామ్ (14), తైజుల్ ఇస్లామ్ (11 నాటౌట్) కలిసి 25 పరుగులు జోడించడంతో బంగ్లా కనీసం ఆ స్కోరైనా చేయగలిగింది.

గ్రీన్, స్మిత్ పోరాటం.. షోరిఫుల్ ఇస్లామ్ 6 వికెట్లు

అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియాకు సైతం ఆరంభంలోనే గట్టి షాక్ తగిలింది. అయితే కామెరూన్ గ్రీన్, స్టీవ్ స్మిత్ (42) నాలుగో వికెట్‌కు 77 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఇతర బ్యాటర్లు విఫలమైనప్పటికీ గ్రీన్ ఓపికగా ఆడి ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో రీ-ఎంట్రీ ఇచ్చిన షోరిఫుల్ ఇస్లామ్ (6/35) అద్భుత బౌలింగ్‌తో ఆరు వికెట్లు తీసి ఆసీస్‌ను దెబ్బతీశాడు.



ప్రస్తుతం క్రీజులో గ్రీన్‌తో పాటు నాథన్ లయన్ (10 నాటౌట్) ఉన్నాడు.

పిచ్‌పై తీవ్ర విమర్శలు

పూర్తిగా పేస్‌కే సహకరిస్తూ మొదటి రోజే 18 వికెట్లు పడిపోయేలా పిచ్‌ను సిద్ధం చేయడంపై క్రీడాభిమానుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలి టెస్టులో బంగ్లాదేశ్ చేతిలో ఎదురైన ఘోర పరాజయం నుంచే భయపడి ఆస్ట్రేలియా ఇటువంటి పిచ్‌ను రూపొందించిందని సోషల్ మీడియాలో నెటిజన్లు మండిపడుతున్నారు.

# డ్యూరాండ్ కప్ ఫైనల్‌లో ఈస్ట్ బెంగాల్—మోహన్ బగాన్ ఢీ



**22 ఏళ్ల నిరీక్షణకు తెరదించడమే లక్ష్యం.. హబాస్ కన్ను చరిత్రపై**

బలగం టీవీ, హైదరాబాద్

డ్యూరాండ్ కప్ ఫైనల్‌లో ఆదివారం చిరకాల ప్రత్యర్థులు ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ సూపర్ జెయింట్ తలపడనున్నాయి. ఈ పోరులో ఈస్ట్ బెంగాల్ కోచ్ ఆంటోనియో లోపెజ్ హబాస్ మరోసారి చరిత్ర సృష్టించాలనే పట్టుదలతో ఉన్నాడు. ఈస్ట్ బెంగాల్‌ను విజేతగా నిలిపితే డ్యూరాండ్ కప్‌ను అత్యధికంగా 17 సార్లు గెలిచిన జట్ల జాబితాలో ఆ జట్టును నిలబెట్టడంతో పాటు, తన ఖాతాలోనూ మరో ఘనతను చేర్చుకోవాలని హబాస్ భావిస్తున్నాడు.

ఈస్ట్ బెంగాల్ 22 ఏళ్లుగా డ్యూరాండ్ కప్ కోసం ఎదురుచూస్తోంది. ఆదివారం విజయం సాధిస్తే మోహన్ బగాన్‌తో సమంగా 17 టైటిళ్లు సాధించే అవకాశం ఆ జట్టుకు లభించనుంది. మరోవైపు మోహన్ బగాన్ 18వ టైటిల్‌పై కన్నేసింది.

హబాస్ రాకతో కొత్త రూపు

గత సీజన్‌లో ఐఎస్ఎల్ టైటిల్ సాధించిన ఈస్ట్ బెంగాల్.. కోచ్ ఆస్కార్ బ్రుజోన్ నిష్క్రమణ, ఎమామితో అనుబంధం ముగిసిన తర్వాత కొత్త రూపు సంతరించుకుంది. హబాస్ బాధ్యతలు చేపట్టిన కొద్దికాలంలోనే జట్టుపై తనదైన ముద్ర వేశాడు. రక్షణాత్మక క్రమశిక్షణ, మిడ్‌ఫీల్డ్‌లో సమన్వయం, సహనం ఈస్ట్ బెంగాల్ ఆటలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్-2 ప్రిలిమినరీ రౌండ్‌లోనూ ఈస్ట్ బెంగాల్ సత్తా చాటింది. కువైట్‌కు చెందిన అల్ అరబీపై 0-1తో వెనుకబడినప్పటికీ 4-1తో ఘన విజయం సాధించి గ్రూప్ దశకు అర్హత సాధించింది.

డ్యూరాండ్ కప్‌లోనూ ఆ జట్టు రక్షణ విభాగం పటిష్ఠంగా ఉంది. తొలి మ్యాచ్‌లో మోహన్ బగాన్‌పై ఒక గోల్ ఇచ్చిన తర్వాత వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులకు గోల్ చేసే అవకాశం ఇవ్వలేదు. ఎస్సీ ఢిల్లీతో సెమీఫైనల్ 0-0తో ముగియగా, పెనాల్టీ షూటౌట్‌లో 5-3తో విజయం సాధించింది.

అలసట పెద్ద సమస్య

అయితే వరుస మ్యాచ్‌లు ఈస్ట్ బెంగాల్‌కు సవాల్‌గా మారాయి. 15 రోజుల్లోనే ఇది ఆ జట్టుకు ఐదో మ్యాచ్. సౌత్ యునైటెడ్ ఎఫ్‌సీ, అల్ అరబీ, ఇండియన్ ఆర్మీ ఎఫ్‌టీ, ఎస్సీ ఢిల్లీతో మ్యాచ్‌లు ఆడిన తర్వాత ఫైనల్‌కు సిద్ధమవుతోంది. వచ్చే నెల నుంచి ఏఎఫ్‌సీ ఛాంపియన్స్ లీగ్-2 గ్రూప్ దశ కూడా ప్రారంభం కానుంది.

దీంతో ఫైనల్‌కు ముందు సాధారణ శిక్షణకు బదులుగా ఆటగాళ్లకు హబాస్ విశ్రాంతికే ప్రాధాన్యం ఇచ్చాడు. జట్టు హోటల్‌లో వ్యూహాత్మక సమావేశం నిర్వహించిన అనంతరం మ్యాచ్‌కు సిద్ధం కానున్నారు.

స్పెయిన్ డిఫెండర్ నాచో మోన్సాల్వే మోకాలి గాయంతో బాధపడుతున్నాడు. అల్ అరబీ, ఎస్సీ ఢిల్లీతో మ్యాచ్‌లకు అతడు దూరమయ్యాడు. అతడి ఫిట్‌నెస్‌పై ఫైనల్‌కు ముందు నిర్ణయం తీసుకోనున్నారు.

కెప్టెన్ మహ్మద్ రషీద్ మిడ్‌ఫీల్డ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. జే గుప్తా, అన్వర్ అలీ, సందీప్ మాండి, హార్దిక్ భట్‌లతో కూడిన రక్షణ విభాగం ఈస్ట్ బెంగాల్‌కు బలంగా మారింది.

మోహన్ బగాన్‌దీ అదే జోరు

మరోవైపు కొత్త గ్రీకు కోచ్ పనాజియోటిస్ డిల్బెరిస్ నేతృత్వంలోని మోహన్ బగాన్ గ్రూప్-ఏలో తొమ్మిది పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్ దశలో 15 గోల్స్ చేసిన ఆ జట్టు ఒక్క గోల్ కూడా ప్రత్యర్థులకు ఇవ్వలేదు. ఈ క్రమంలో ఈస్ట్ బెంగాల్‌ను 1-0తో ఓడించింది.

అయితే నాకౌట్ దశలో మోహన్ బగాన్‌కు గట్టి పోటీ ఎదురైంది. జంషెడ్‌పూర్ ఎఫ్‌సీతో క్వార్టర్ ఫైనల్ 1-1తో ముగియగా.. పెనాల్టీ షూటౌట్‌లో 9-8తో విజయం సాధించింది. సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ నార్త్‌ఈస్ట్ యునైటెడ్‌తో 0-0 డ్రా అనంతరం పెనాల్టీ షూటౌట్‌లో 4-3తో గెలిచింది. గోల్‌కీపర్ విశాల్ కైత్ కీలక సమయంలో రెండు అద్భుతమైన సేవ్‌లు చేసి జట్టును ఫైనల్‌కు చేర్చాడు.

ఫైనల్‌లో మరోసారి కోల్‌కతా డెర్బీ

డ్యూరాండ్ కప్ ఫైనల్‌లో ఈ రెండు జట్లు ఇప్పటివరకు 13 సార్లు తలపడ్డాయి. 2023లో జరిగిన చివరి ఫైనల్‌లో మోహన్ బగాన్ 1-0తో ఈస్ట్ బెంగాల్‌ను ఓడించి 17వ టైటిల్‌ను సాధించింది.

ఇప్పుడు మోహన్ బగాన్ 18వ టైటిల్ కోసం, ఈస్ట్ బెంగాల్ 17వ కప్ కోసం బరిలోకి దిగుతున్నాయి. మోహన్ బగాన్ డ్రెస్సింగ్ రూమ్, జట్టు వ్యవస్థపై మంచి అవగాహన ఉన్న హబాస్‌కు ఈ ఫైనల్ ప్రత్యేక సవాల్‌గా మారింది. ఈస్ట్ బెంగాల్‌కు మాత్రం హబాస్ ఆధ్వర్యంలో మొదలైన కొత్త ప్రయాణాన్ని ప్రతిష్ఠాత్మక డ్యూరాండ్ కప్‌తో ప్రారంభించాలనే పట్టుదల ఉంది.



## నెదర్లాండ్స్ చేతిలో భారత్ ఓటమి!
## 0-2తో సలీమా సేన పరాజయం.. సంక్లిష్టంగా మారిన సెమీస్ అవకాశాలు

**ఆస్ట్రేలియాతో జరగబోయే ఆఖరి మ్యాచ్ భారత్‌కు కీలకం**

బలగం టీవీ, హైదరాబాద్

మహిళల హాకీ ప్రపంచకప్‌లో భారత జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం జరిగిన పూల్-ఈ తొలి మ్యాచ్‌లో సలీమా టేటే నాయకత్వంలోని టీమిండియా 0-2 తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ నెదర్లాండ్స్ చేతిలో ఓటమి పాలైంది. ఆరంభం నుంచే అటాకింగ్ గేమ్‌తో విరుచుకుపడిన డచ్ జట్టు రెండో నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ ద్వారా తొలి గోల్ సాధించి ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 38వ నిమిషంలో లభించిన మరొక పెనాల్టీ కార్నర్‌ను కూడా గోల్‌గా మలచి 2-0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ ఏకంగా 10 పెనాల్టీ కార్నర్‌లను దక్కించుకోగా, భారత్ కేవలం 2 కార్నర్‌లను మాత్రమే సాధించగలిగింది.

**భారత్ సెమీఫైనల్ చేరాలంటే..**

ఈ ఓటమితో పూల్-ఈలో భారత్ ఒకే ఒక్క పాయింట్‌తో (చైనాతో మ్యాచ్ డ్రా ద్వారా) నాలుగో స్థానంలో కొనసాగుతోంది. వరుసగా రెండు విజయాలు సాధించిన నెదర్లాండ్స్ (6 పాయింట్లు) ఇప్పటికే సెమీస్‌కు అర్హత సాధించగా, రెండో బెర్త్ కోసం ఆస్ట్రేలియా, చైనా, భారత్ పోటీపడుతున్నాయి. సలీమా సేన సెమీస్‌కు అర్హత సాధించాలంటే కింద పేర్కొన్న సమీకరణాలు కలిసి రావాల్సి ఉంది:

ఆస్ట్రేలియాపై గెలుపు తప్పనిసరి: ఆగస్టు 23న జరగనున్న తమ చివరి పూల్ మ్యాచ్‌లో భారత్ కచ్చితంగా ఆస్ట్రేలియాను ఓడించాలి. ఓడిపోయినా లేదా డ్రా చేసుకున్నా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

నెదర్లాండ్స్ ఫలితంపై ఆధారపడి: ఆస్ట్రేలియాపై భారత్ విజయం సాధించడంతో పాటు, తన ఆఖరి మ్యాచ్‌లో చైనాపై నెదర్లాండ్స్ గెలవడం గానీ లేదా మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం గానీ జరగాలి.

ఈ రెండు సమీకరణాలు కుదిరితే భారత్ 4 పాయింట్లతో గ్రూప్-ఈలో రెండో స్థానానికి చేరుకుని సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంటుంది.



## టెస్టుల్లో పాకిస్తాన్ అత్యంత చెత్త రికార్డు!

**ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 'సున్నా'కే తొలి వికెట్**

**ఇంగ్లండ్ చేతిలో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో ఘోర పరాజయం**

బలగం టీవీ, హైదరాబాద్

ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లోనే పాకిస్థాన్ తీవ్ర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూడటమే కాకుండా, టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే మరే జట్టు నమోదు చేయని అత్యంత చెత్త రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి పాకిస్థాన్ తొలి, రెండో ఇన్నింగ్స్‌లు రెండింటిలోనూ ఖాతా తెరవకుండానే (సున్నా పరుగులకే) తొలి వికెట్‌ను కోల్పోయింది.

అత్యధిక సార్లు సున్నాకే వికెట్ పారేసుకున్న జట్టు

ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఖాతా తెరవకుండానే మొదటి వికెట్ కోల్పోవడం పాకిస్థాన్ జట్టుకు ఇది ఏడోసారి కావడం గమనార్హం.

పాకిస్థాన్: 472 టెస్టుల్లో 7 సార్లు (సగటున ప్రతి 68 మ్యాచ్‌లకు ఒకసారి).

ఇంగ్లండ్: 1098 టెస్టుల్లో 5 సార్లు.

భారత్: 2 సార్లు మాత్రమే.

మ్యాచ్ సంక్షిప్త వివరాలు

పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 171 ఆలౌట్ (అబ్దుల్లా షఫీక్ 61, ఇమామ్ ఉల్ హక్ 42; జోష్ టంగ్ 5/46, ఓలీ రాబిన్సన్ 5/51).

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 409 ఆలౌట్ (హ్యారీ బ్రూక్ 91, జోర్డాన్ కాక్స్ 73, జో రూట్ 66; అలి ఉస్మాన్ 5/95).

పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్: 135 ఆలౌట్ (మహమ్మద్ రిజ్వాన్ 41, షాన్ మసూద్ 29; జోష్ టంగ్ 3/21, ఓలీ రాబిన్సన్ 3/31, జోఫ్రా ఆర్చర్ 3/32).



## ఫిఫా సంచలన నిర్ణయం

**అర్జెంటీనాకు రూ.3.64 కోట్ల భారీ జరిమానా!**

**వరల్డ్ కప్ ఫైనల్ అనంతరం గొడవపై తీవ్ర ఆగ్రహం**

**పలువురు కీలక ఆటగాళ్లపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు**

బలగం టీవీ, హైదరాబాద్

ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ పోరు ముగిసిన అనంతరం మైదానంలో చోటుచేసుకున్న అవాంఛనీయ సంఘటనలపై ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (FIFA) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడినందుకు గానూ అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘానికి రూ.3.64 కోట్ల భారీ జరిమానా విధించింది. టైటిల్ పోరులో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైన తర్వాత లియోనల్ మెస్సీ బృందం హద్దులు మీరడం, స్పెయిన్ ఆటగాళ్లతో గొడవకు దిగడంపై తీవ్రంగా పరిగణించిన ఫిఫా ఈ కఠిన చర్యలు తీసుకుంది.

కీలక ఆటగాళ్లపై సస్పెన్షన్ వేటు

మైదానంలో భౌతిక దాడులు, గొడవలకు దిగిన అర్జెంటీనా, స్పెయిన్ ఆటగాళ్లతో పాటు కోచింగ్ సిబ్బందిపై ఫిఫా మ్యాచ్ నిషేధాలు విధించింది:

లియాండ్రో పరేడ్స్ (మిడ్‌ఫీల్డర్): ఇతనిపై అత్యధికంగా 10 మ్యాచ్‌ల నిషేధంతో పాటు భారీ జరిమానా విధించారు.

నహుల్ మొలినా (డిఫెండర్): మైదానంలో గొడవకు దిగినందుకు ఇతనికి 7 మ్యాచ్‌ల నిషేధం పడింది.

థియాగో ఆల్మడ: ఇతనిపై ఒక మ్యాచ్ నిషేధం విధించారు.

గవి (స్పెయిన్): అర్జెంటీనా ఆటగాళ్లతో ఘర్షణకు దిగిన స్పెయిన్ ఆటగాడు గవిపై కూడా ఒక మ్యాచ్ నిషేధం పడింది.

రాజకీయ ప్రదర్శనలపై ఆగ్రహం

ఫైనల్ మ్యాచ్ వివాదంతో పాటు సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌పై గెలిచిన అనంతరం అర్జెంటీనా ఆటగాళ్లు "ది ఫాక్లాండ్స్ అర్జెంటీనావే" అని ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించడాన్ని కూడా ఫిఫా తీవ్రంగా పరిగణించింది. క్రీడా వేదికలను క్రీడేతర రాజకీయ అంశాల ప్రదర్శనకు ఉపయోగించడం తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేసింది.

## టీ20 భవిష్యత్ ఫార్మాట్.. కానీ టెస్టులు, వన్డేలను కాపాడాలి

**క్రికెట్ బోర్డులకు శ్రీలంక మాజీ పేసర్ చమిందా వాస్ సూచన**

బలగం టీవీ, హైదరాబాద్

టీ20 క్రికెట్ భవిష్యత్‌లో ప్రధాన ఫార్మాట్‌గా మారుతున్నప్పటికీ టెస్టులు, 50 ఓవర్ల క్రికెట్‌ను కాపాడాల్సిన బాధ్యత అన్ని క్రికెట్ బోర్డులపై ఉందని శ్రీలంక మాజీ పేసర్ చమిందా వాస్ అన్నారు. ఫ్రాంచైజీ లీగ్‌ల పెరుగుదల నేపథ్యంలో సంప్రదాయ ఫార్మాట్ల మనుగడ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

టీ20ల్లో ఆడేందుకు చాలా దేశాలు ఆసక్తి చూపుతున్నాయని, భవిష్యత్‌లో టీ20 క్రికెట్ మరింత ప్రాచుర్యం పొందుతుందని వాస్ పేర్కొన్నారు. అయితే టెస్టులు, వన్డేలు క్రికెట్‌కు పునాదులని, వాటిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.టెస్టు క్రికెట్ క్రమంగా ఆదరణ కోల్పోతోందని వాస్ ఆందోళన వ్యక్తం చేశారు. యువ ఆటగాళ్లకు టెస్టు, 50 ఓవర్ల క్రికెట్‌లో ఎక్కువ అవకాశాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లోనే ఆటగాడి అసలు నైపుణ్యం పరీక్షకు గురవుతుందని చెప్పారు. శ్రీలంక టెస్టు క్రికెట్‌లో ప్రమాణాలు గత దశాబ్దంలో తగ్గిపోవడానికి తక్కువ సంఖ్యలో టెస్టు మ్యాచ్‌లు ఆడటమే ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. రెండు టెస్టుల సిరీస్‌ల వల్ల ఆటగాళ్లకు పెద్దగా ప్రయోజనం ఉండదని, అత్యున్నత స్థాయిలో మరిన్ని రెడ్‌బాల్ మ్యాచ్‌లు ఆడేలా శ్రీలంక క్రికెట్ బోర్డు చర్యలు తీసుకోవాలని కోరారు.

బలగం TV BALAGAM






# వందకోట్ల క్లబ్బులోకి డిసి మూవీ




టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మి ంచిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుద లైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచ వ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకు న్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

# CINEMA



# ఇరుముడి ఎమోషనల్ డ్రామా




రవితేజ హీరోగా 'ఇరుముడి' అనే టైటిల్ ప్రకటించినప్పటి నుంచే ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఇందులోని పాటలు, ట్రైలర్‌లో చూపించిన ఫ్యామిలీ ఎమోషన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. కచ్చితంగా రవితేజకి ఇది కమ్‌బ్యాక్ సినిమా అవుతుందని

అందరూ భావించారు. పీలేరు ప్రాంతంలో త్రినాథ్(రవితేజ) ఆటో నడుపుతూ, అరటిపళ్ల వ్యాపారం చేస్తూ కూతురు మణెమ్మ(నక్షత్ర), భార్య కావేరి(ప్రియా భవానీ శంకర్)తో ఆనందంగా జీవిస్తుంటాడు. ఆ ప్రాంతంలో అందరి ఆడపిల్లలని తన కూతురులానే చూస్తుంటాడు. తనకు మద్యం అలవాటు ఉంటుంది. కాకపోతే అయ్యప్ప స్వామి మాలలో ఉన్నప్పుడు మాత్రం మందు జోలికి వెళ్లడు. అదే ప్రాంతంలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని అనూహ్యంగా చనిపోతుంది. ఆ మరణం వెనుక ఉన్నది ఎవరు? ఈ చావు త్రినాథ్ కుటుంబాన్ని ఎలా ప్రభావితం చేసిందనేది మిగతా కథ.

తెలుగులో చాలా క్రైమ్ థ్రిల్లర్స్ వచ్చాయి. కాకపోతే కుటుంబ, అయ్యప్ప మాల నేపథ్యంలో ఒక ఎమోషనల్ థ్రిల్లర్‌గా 'ఇరుముడి' ప్రత్యేకంగా కనిపిస్తుంది. సినిమా కథ ప్రారంభం ఓ స్కూల్లో టీచర్ సస్పెండ్ అవడంతో మొదలవుతుంది. ఆ తర్వాత కుటుంబం, మణెమ్మతో ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ను ఎస్టాబ్లిష్ చేయడానికి కొంత సమయం పడుతుంది. ఎప్పుడైతే పదో తరగతి చదువుతున్న ఓ అమ్మాయి అనూహ్యంగా చనిపోతుందో, అక్కడి నుంచి కథలో ఉత్కంఠ పెరుగుతుంది. అది విరామానికి వచ్చేసరికి ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి, ఎమోషన్ కలిగిస్తుంది. ఈ కథను దర్శకుడు హ్యాండిల్ చేసిన తీరు ఆకట్టుకుంటుంది. కథలో మంచి ట్విస్టులు రాసుకున్నారు. ఒక హార్ట్ టచింగ్ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా కథను దర్శకుడు శివ నిర్వాణ నడిపించారు. అదే సమయంలో ఒక బలమైన సందేశం కూడా ఇచ్చారు. ఆ సందేశం కచ్చితంగా గుర్తుపెట్టుకుని పాటించదగ్గదిగా ఉంటుంది. రవితేజ తన మాస్ ఇమేజ్‌ను పక్కన పెట్టి పూర్తిగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో నటించారు. త్రినాథ్ పాత్రలో ఆయన పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. ఒకవైపు ఎమోషనల్ తండ్రిగా, మరోవైపు మద్యానికి బానిసైన వ్యక్తిగా, అయ్యప్ప మాల వేసుకున్న భక్తుడిగా, చివర్లో ఒక తండ్రిగా.. తన పాత్రలో చాలా వేరియేషన్స్ ఉన్నాయి. ఆ వేరియేషన్స్ అన్నింటినీ రవితేజ చాలా పరిణతితో కనబరిచారు. అలాగే మణెమ్మ పాత్రలో చేసిన బేబీ నక్షత్ర పాత్ర కూడా చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. రవితేజ భార్య పాత్రలో కనిపించిన ప్రియా భవానీ శంకర్ పోషించిన కావేరి పాత్ర కూడా చాలా హుందాగా ఉంటుంది. ఆ పాత్ర ఈ సినిమాకు కావాల్సిన ఎమోషన్‌ను యాడ్ చేసింది. గురుస్వామి పాత్రలో చేసిన సాయికుమార్ పాత్ర ఆయనకు చాలా కొత్తగా, అదే సమయంలో ప్రభావవంతంగా ఉంటుంది. సెకండ్ హాఫ్‌లో ఆ పాత్రకు దర్శకుడు రాసుకున్న ఒక మలుపు కూడా కథకు బలాన్ని చేకూర్చింది. అలాగే అజయ్ ఘోష్ పాత్ర కూడా కావాల్సిన క్యూరియాసిటీని పెంచింది. మిగతా నటీనటులు పరిధి మేరకు కనిపించారు. సీలేరు ప్రాంతంలో తీసిన చిత్రమిది. అన్ని ఒరిజినల్ లొకేషన్స్ కావడంతో కథ నిజంగా అక్కడే జరుగుతున్నట్టుగా అనుభూతిని కలిగించింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.




# హాయ్ చిత్రం ట్రైలర్ విడుదల



లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ యంగ్ హీరో కవిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ డ్రామా మూవీ 'హాయ్'. ప్రముఖ గీత రచయిత విష్ణు ఎడవన్ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవు తున్నారు. ఆగస్టు 28న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలో విడుదల కాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తమిళంతో పాటు తెలుగు ట్రైలర్‌ను వదిలింది. ఈ ట్రైలర్ ఫుల్ లవ్, ఫన్ మరియు ఎమోషన్స్‌తో ఆకట్టుకునేలా ఉంది. ప్రేమ వివాహాల కోసం ప్రయత్నించి విఫలమయ్యే సామాన్యుడిగా కవిన్ ఇందులో కనిపించగా, ఆయనకు దేవసేన పాత్రలో నటిస్తున్న నయనతార ఎదురుకావడం జరుగుతుంది. సంప్రదాయాలకు భిన్నంగా ఉండే ఒక స్వతంత్ర భావాలున్న మహిళగా నయనతార లుక్ చాలా ఆకర్షణీయంగా ఉంది. అనుకోని పరిస్థితుల నేపథ్యంలో వీరిద్దరికీ పెళ్లి జరగడం, ఆ తర్వాత వారి మధ్య జరిగే మనస్పర్థలు, భావోద్వేగాలు ఈ సినిమా ప్రధాన కథాంశంగా ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. కవిన్, నయనతార ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా ఉండి సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక ఈ చిత్రంలో నయనతార, కవిన్‌లతో పాటు కే. భాగ్యరాజ్, ప్రభు, రాధికా శరత్‌కుమార్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జెన్ మార్టిన్ సంగీతం అందిస్తుండగా, రాజేష్ శుక్లా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు. జి స్టూడియోస్ సౌత్, రౌడీ పిక్చర్స్ మరియు సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించాయి.

# బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్

## 2026 పోస్టర్ ఆవిష్కరించిన దిల్‌రాజు



హైదరాబాద్,ఆగస్ట్22 : బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవల్‌పమెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 - సీజన్ 2' పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఎఫ్‌డీసీ ఎండీ జి. ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈ సారి కొత్తగా జానపద పాటలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు (ఆర్టికల్స్) కు చోటు కల్పించారు. ఈ పోటీ యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృత స్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయని అన్నారు. ఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని 2026 సెప్టెంబర్15లోపు ÷ూనీబీనిణౌతిపెపజీ၊సబఇఠజ్జీ÷ç÷నిణ၊ అణపజీతి.ఇనీప మెయిల్ కు గానీ, 8125834009 వాట్సాప్ నంబరుకు గానీ పంపాలి. అనంతరం నిపుణులతో కూడిన జ్యూరీ విజేతలను ప్రకటిస్తుంది. పోటీలలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ. లక్ష. మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.20 వేల చొప్పున అందించనున్నారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేస్తారు.

# ఆదిత్యరాయ్ మూవీలో భాగ్యశ్రీభోర్సే



## వార్తలను తోసిపుచ్చిన టీ సీరిస్

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది. తొలి సినిమాతోనే తన గ్లామర్‌తో పాటు నటనతోనూ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత వరుస అవకాశాలు ఆమె తలుపు



తట్టాయి. దుల్కర్ సల్మాన్, రానా దగ్గుబాటి, సముద్రఖని కీలక పాత్రల్లో నటించిన తమిళ చిత్రం 'కాంత' లోనూ భాగ్యశ్రీ నటించింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి స్పందన లభించింది. అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' చిత్రంలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా కనిపించింది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ సరసన కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న 'సేయోన్' సినిమాలో నటిస్తోంది.